www.mudranews.in
సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
హైదరాబాద్ www.mudranews.in | @mudranews
మంగళవారం, 03.02.2026
సంపుటి:13
సంచిక: 103
పేజీలు: 12
వెల: రూ. 5
Published From: Hyderabad

## నేరాలు చేసినా..
# విచారించొద్దంటే ఎలా?
## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి విచారణ చేయాలనడం కరెక్ట్ కాదు
- మీరు చేసిన తప్పులకే అధికారులు నోటీసులు ఇచ్చారు
- అక్రమాలకు పాల్పడిన ఎవరైనా విచారణను ఎదుర్కోవాల్సిందే
- బీఆర్ఎస్ పాలనలో ఇబ్బందిపడని ఉద్యమకారుడు లేడు
- పదేళ్లు తెలంగాణ ప్రజలను విస్మరించారు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** అధికారంలో ఉన్నాం కదా అని నేరాలు చేస్తాం.. విచారించొద్దంటే ప్రజాస్వామ్యంలో నడవదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా విచారణ ఎదుర్కొవాల్సిందేనన్నారు. ఆ తప్పు నిరూపణ అయితే శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరిగిందన్న సీఎం.. అప్పటి ముఖ్యమంత్రిగా ఈ వ్యవహారంపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేసీఆర్ మీద ఉందన్నారు. ఈ కేసులో ఆయనను విచారించడానికి సిట్ అధికారులు నోటీ

మిగతా 02లో

## రాష్ట్ర సర్కార్‌కు సుప్రీంలో చుక్కెదురు
### సోషల్ మీడియా పోస్టుల కేసులపై ప్రభుత్వానికి ఎదురుదెబ్బ



- భావ ప్రకటన స్వేచ్ఛకు రాజ్యాంగ రక్షణ ఉందని పునరుద్ఘాటన
- హైకోర్టు మార్గదర్శకాలను సమర్థించిన సర్వోన్నత న్యాయస్థానం
- ప్రతి చిన్న పోస్టుపై ఎఫ్ఐఆర్‌లు వేయడం సరికాదన్న న్యాయస్థానం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త శశిధర్ గౌడ్ కేసే నేపథ్యం

03

## ఫోన్ ట్యాపింగ్ ఎక్కడ జరిగిందో చెప్పండి
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- ఆ కేసును ధారావాహిక సీరియల్ మాదిరి నడుపుతున్నారు
- చట్టం అంటే కేసీఆర్‌కు గౌరవం ఉన్నందునే విచారణకు

03

## వేటు పడుద్ది
### రెబెల్స్ కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హెచ్చరిక



- కాదని పోటీ చేస్తే పార్టీ నుంచి సస్పెండ్
- మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు సహకరించాల్సిందే
- కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ విడుదల

03

## కొడంగల్ లిఫ్ట్‌కు ఆదిలోనే
# అడ్డంకులు!
### భూసేకరణ పనుల్లో అధికారుల అలసత్వం

- పలు గ్రామాల్లో భూములు ఇవ్వమని రైతుల ఖరాకండి
- భూ పరిహారం ఎకరాకు రూ. 40 లక్షలు ఇవ్వాలని రైతుల డిమాండ్
- రూ. 20 లక్షలు ఇస్తామని ప్రకటించిన రేవంత్ సర్కార్
- రైతుల నుంచి సానుకూలత రాకపోవడం తో దిక్కుతోచని స్థితి లో అధికారులు
- కెసిఆర్ మరుగున పడేసిన ఈ ప్రాజెక్టు జీవం పోస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- ప్రాజెక్టు పనులకు నిధులు విడుదల చేసినా భూసేకరణ కు ముందుకు రాని రైతులు
- సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు కు మొక్షం ఎన్నడో



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రానికి పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కెసిఆర్ నారాయణ పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా మరుగున పడేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఈ ప్రాజెక్టు ను పూర్తి చేస్తానని చేసిన ప్రకటన కేవలం ఎన్నికల స్టంట్ కు ఉపయోగించుకున్నారు.పదేళ్లు అధికారంలో ఉన్న ఆయన ఎన్నికల ఎజెండాకు మాత్రమే ఈ ప్రాజెక్టు రాగం అందుకున్నారు. కానీ ఏనాడు ఈ ప్రాజెక్టుకు పైసా విదిల్చలేదు. కెసిఆర్ హయాంలో తొక్కి పడేసిన ఈ లిఫ్టుకు సీఎం గా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రాజెక్టు పనులకు జీవం పో

మిగతా 02లో



## ఇందిరమ్మ ఇళ్లకు
# ఊతం
### 4.13 లక్షల ఇళ్లకు నిధులు

ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర సాయం అందనున్నది. కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై కింద తెలంగాణ రాష్ట్రంలో 4 లక్షలకు పైగా ఇండ్లకు తమ వంతు వాటాగా నిధులు అందించనుంది. త్వరలోనే నిధులు విడుదల చేసే అవకాశాలున్నాయి.

09

## బడ్జెట్‌లో తెలంగాణకు
# గుడ్‌న్యూస్

- 2 గంటల్లో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రయాణం
- హైస్పీడ్ డైమండ్ కారిడార్
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

09



# సిట్.. లైట్

- కేసీఆర్ విచారణ లో ఏం జరిగింది..?
- సిట్ ప్రశ్నలు–కేసీఆర్ కౌంటర్లు.. విచారణలో సీన్ రివర్స్!
- 'సీఎంకు సంబంధం ఏంటి?' అంటూ సిట్‌ను నిలదీసిన కేసీఆర్
- 25 ప్రశ్నలకు ఒకే సమాధానం.. 'నాకు లింక్ లేదు'
- ఇంటెలిజెన్స్ పని అది.. సీఎంకి ఎలా తెలుస్తుంది? కేసీఆర్ లాజిక్
- నాలుగున్నర గంటల విచారణ.. బయటకు వచ్చి కూడా లైట్ తీసుకున్న కేసీఆర్
- మీడియాకు నో కామెంట్.. లాయర్లు, కేటీఆర్, హరీష్‌తో అంతర్గత చర్చలు
- విచారణ తర్వాతే మున్సిపల్ ఎన్నికల రివ్యూ.. పార్టీపై ఫుల్ కాన్ఫిడెన్స్
- 'మనదే బలం'.. గులాబీ గూటికి తిరిగి వచ్చే నేతలపై హింట్
- ఫోన్ ట్యాపింగ్ కేసులో నెక్ట్స్ ఏంటి? రాజకీయ వేడి మరింత పెరుగుతుందా?




**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించిన సిట్.. విచారణలో ఏం తేలిందనేది హాట్ టాపిక్ గా మారింది. దాదాపు 25 ప్రశ్నలతో వెళ్లిన సిట్ అధికారులకు కేసీఆర్ నుంచే ఎదురు ప్రశ్నలు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా సిట్ అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ నుంచి ఒకే సమాధానం వచ్చినట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో ఏం జరిగినా సీఎంకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ఇంటలీజెన్సీ వర్గాలదేనని, ఎలా సమాచారం సేకరించారో సీఎంకు ఎలా తెలుస్తుందని, తెలుసుకోవాల్సిన అవసరం ఏముంటుందని కేసీఆర్ ఎదురు ప్రశ్నించినట్లు టాక్. అంతేకాదు.. ఫోన్ ట్యాపింగ్ కేసుకు.. అప్పుడు సీఎంగా తనకు ఏం సంబంధం లేదంటూ కేసీఆర్ పదేపదే చెప్పినట్లు సమాచారం.

**అధ్యంతం ఉత్కంఠ**

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆదివారం సిట్ అధికారులు ప్రశ్నించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7.30 వరకు విచారించారు. ఇప్పటి వరకు సేకరించిన ఆధారాలను ఆయన ముందు పెట్టి ఆరుగురుతో కూడిన సిట్ ఆయన్ని ప్రశ్నించినట్టు ప్రచారం సాగుతోంది. విచారణ నందినగర్‌లోని ఆయన నివాసంలో సాగుతుంటే మోరోవైపు ఆ ఇంటి పరిసర ప్రాంతాలు, తెలంగాణ భవన్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారీగా చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎక్కడికక్కడ బీఆర్ ఎస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకొని కట్టడి చేశారు. అయితే, కేసీఆర్ ను విచారిస్తున్నంత సమయం రాష్ట్రంలో ఉత్కంఠ నెలకొంది.

**లైట్ తీసుకున్న కేసీఆర్..**

సిట్ విచారణను కేసీఆర్ చాలా తేలిగ్గా తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. సిట్ విచారణ గురించి ఆయన ఎక్కడా ప్రస్తావించలేదు. రాత్రి ఏడున్నరకు విచా

మిగతా 02లో

## హార్వర్డ్‌లో చదువుకున్నా
# గుణం మారలేదు
### హార్వర్డ్ షో.. మాటలలో మాత్రం పాత ద్వేషమే!



- నాలుగు రోజులు హార్వర్డ్.. నాలుగు మాటల్లోనే అసలు స్వభావం!
- విద్య మారింది.. వాగుడు మారలేదు!, సంస్కారం లేని స్పీచ్‌కే సీఎం సీల్!
- హార్వర్డ్‌కే చిక్కని నోటిమురికి!,
- తెలంగాణ చరిత్ర తెలియని సీఎం ప్రసంగం!
- అధికార మత్తులో అక్కసు మాటలు!,
- సీఎం రేవంత్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

09

# సజ్జనార్ టార్గెట్..

- ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ చీఫ్ ట్వీట్‌తో రాజకీయ దుమారం
- వీసీ సజ్జనార్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ అభ్యంతరం
- ఒక ట్వీట్‌తో కేసుకు రాజకీయ రంగు.. మరింత ముదిరేనా వివాదం?

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం చంద్రశేఖర్ రావును సిట్ విచారించిన అనంతరం హైదరాబాద్ సిటీ సీపీ వీసీ సజ్జనార్ చేసిన ఒక్క ట్వీట్ తెలంగాణ రాజకీయాలను మరోసారి వేడెక్కించింది. విచారణ ఇంకా కొనసాగుతున్న దశలోనే 'అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు' అంటూ వ్యాఖ్యానించడం ద్వారా సిట్ చీఫ్ ముందస్తు తీర్పు ఇచ్చినట్లుగా ఉందని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. నువ్వు పోలీసువే గానీ జడ్జివి కాదంటూ కేటీఆర్ చేసిన ఘాటు వ్యాఖ్యలతో ఈ వివాదం రాజకీయ రంగు పులుముకుని మరింత ముదిరుతోంది.

10




## పడిపోయిన
# బంగారం, వెండి ధరలు




- ఒక్కసారిగా కుప్పకూలిన పసిడి, వెండి
- హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తగ్గిన ధరలు
- గత గరిష్ఠాలతో పోలిస్తే భారీ డిస్కౌంట్

10







## తాడిచర్ల–1 గనులు
# తెలంగాణకే
### రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ

02

## కార్యకర్తలకే కమలం
# పెద్దపీట
### 80 శాతం మంది కార్యకర్తలకే కార్పొరేటర్ టిక్కెట్లు

10



## ప్రజల విశ్వాసాన్ని
# నిలబెట్టుకున్నాం
### ఆధునీకరించిన ఐఅండ్ పీఆర్ వెబ్‌సైట్ ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



03

**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**



తిరుమల (ఆంధ్రప్రదేశ్): ప్రపంచ ప్రసిద్ధి గాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఇక్కడ ఉంది. కొండలపై ప్రకృతి అందాల మధ్య ఆధ్యాత్మిక ప్రశాంతతను ఈ క్షేత్రం అందిస్తుంది.

## కొత్తగా ఏర్పడిన పట్టణాలనూ పీఎంఏవైలోకి తేవాలి

### భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**న్యూఢిల్లీ, ముద్ర:** కొత్తగా ఏర్పడిన పట్టణ స్థానిక సంస్థలను కూడా ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పరిధిలోకి తీసుకురావాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన పార్లమెంటరీ హౌసింగ్, పట్టణ వ్యవహారాల స్థాయి కమిటీ సమావేశంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. పట్టణ స్థానిక సంస్థలలో ఆదాయ సమీకరణ, బడ్జెట్ నిర్వహణపై జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రం తరపున మాట్లాడిన ఎంపీ చామల, కొత్త యూఎల్బీలను పీఎం ఏవైలో చేర్చడం ద్వారా మెప్మా–పీఎంఏవై (యూ) 2.0 పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని వివరించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోకి 27 పరిసర పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేస్తున్న విషయాన్ని కమిటీ దృష్టికి తీసుకెళ్లిన ఆయన, జీహెచ్ఎంసీ విస్తృత పరిధిలోకి వచ్చిన ఈ యూఎల్బీలలో కూడా పీఎంఏవై అమలుకు అవకాశం కల్పించాలని సూచించారు. దీని ద్వారా పట్టణ పేదలకు గృహ పథకాలు మరింత విస్తృతంగా, సమర్థవంతంగా అమలవుతాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## కొడంగల్ లిఫ్ట్ కు ఆదిలోనే అడ్డంకులు!

(మొదటి పేజీ తరువాయి)

శారు. ఎన్ని నిధులు ఖర్చయిన పూర్తి చేస్తానని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఈ లిఫ్ట్ పనులకు శంకుస్థాపన చేశారు. వెంటనే భూసేకరణ పనులు చేపట్టాలని ఇక్కడి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఎకరాకు రూ. 10 లక్షలు పరిహారం ఇస్తామని ప్రకటించారు. ఇందుకు ఆయకట్టు రైతులు ఒప్పుకోలేదు. ఇంత తక్కువ ధరకు భూములు ఇవ్వమని ఖరాకండిగా చెప్పారు. అధికారులు భూసేకరణకు వెళ్లిన సమయంలో రైతులు అడ్డుకున్నారు. పలు గ్రామాల్లో అధికారులపై దాడులు చేసేందుకు కూడా వెనుకాడలేదు. ఎకరాకు రూ. 40 లక్షలు ప్రకటిస్తే భూములు ఇస్తామని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఏడాది క్రితం నారాయణ పేటకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ వేదిక ద్వారా భూపరిహారం రూ. 20 లక్షలు ఇస్తామని, ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం రైతులు పెద్ద మనసు చేసుకుని భూములు ఇవ్వాలని కోరారు. సీఎం ప్రకటనతో కొన్ని గ్రామాల్లో భూసేకరణ పనులు కొనసాగినా మరికొన్ని గ్రామాల్లో రైతులు ఇంకా మంకుపట్టు వీడడం లేదు. ఎకరాకు రూ. 40 లక్షలు ఇస్తేనే భూములు ఇస్తామని రైతులు అంటున్నారు. భూసేకరణ కోసం వెళ్లిన అధికారులను అడ్డుకుంటున్నారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రస్తుతం భూ సేకరణ పెద్ద సమస్యగా మారింది. రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు ఎన్నడూ ముందుకు వెళుతుందో తెలియని పరిస్థితి వచ్చింది. ఈ ప్రాజెక్టు పరిధిలో మక్తల్, నారాయణ పేట, కొడంగల్ నియోజకవర్గాలు ఉన్నాయి. మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్, పర్ణిక రెడ్డి నారాయణ పేట కాంగ్రెస్ ఎమ్మెల్యే, సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ లిఫ్ట్ పనులు అనుకున్న విధంగా ముందుకు సాగడం లేదు.

**ప్రాజెక్టు ముఖ్య ఉదేశ్యం**

ఈ ప్రాజెక్టు ద్వారా ఏడు టీఎంసీల నీటిని మూడు పంపుహౌస్‌ల ద్వారా తరలిస్తారు. ఒకటో ప్యాకేజీ కింద రూ. 1179.24 కోట్లు, రెండో ప్యాకేజీ కింద రూ.1172.79 కోట్లకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. రెండు ప్యాకేజీలలో పంపుహౌస్‌లు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం మక్తల్ మండలంలో 155.38 ఎకరాలు, ఊట్కూరులో 235, నారాయణపేట 94.14, దామరగిద్ద మండలంలో 75.16 ఎకరాలు సేకరించనున్నారు. అందులో 17.17 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఏడు టీఎంసీల నీటిని మూడు పంపు హౌస్‌ల ద్వారా తరలిస్తారు. ఒకటో ప్యాకేజీ కింద రూ. 1179.24 కోట్లు, రెండో ప్యాకేజీ కింద రూ.1172.79 కోట్లకు ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. రెండు ప్యాకేజీలలో పంపుహౌస్‌లు, పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఇందుకోసం మక్తల్ మండలంలో 155.38 ఎకరాలు, ఊట్కూరులో 235, నారాయణ పేట 94.14, దామరగిద్ద మండలంలో 75.16 ఎకరాలు సేకరించనున్నారు. అందులో 17.17 ఎకరాలు ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇప్పటికే నీటి పారుదల శాఖ అధికారులు లైడార్ సర్వే కూడా నిర్వహించారు. భూసేకరణ పనులు పూర్తవుతే ఈ ప్రాజెక్టు పనులు ముందుకు సాగే అవకాశం ఉంది.



## సిట్.. లైట్

(మొదటి పపేజీ తరువాయి)

రణ పూర్తి అయిన తర్వాత కేసీఆర్ నంది నగర్ నుంచి తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ పార్టీ శ్రేణులకు అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. చాలా యాక్టివ్‌గా కనిపించారు. సిట్ విచారణపై ఆయన మీడియాతో మాట్లాడతారని మొదట ప్రచారం జరిగింది. కానీ ఆయన మాత్రం దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. సిట్ విచారణ జరిగిన తీరుపై లాయర్లు, కేటీఆర్, హరీష్‌తో చర్చించినట్లు సమాచారం అందుతోంది. అంతే తప్ప ఇంకా ఎక్కడ కూడా సిట్ ప్రస్తావన రాలేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఏదో కేసులో విచారణ అయింది అనే ఆందోళన కూడా ఎక్కడా కనిపించలేదు.

**ఎవరు ఎవరిని ప్రశ్నించారు..?**

విచారణకు వెళ్లిన సిట్ బృందాన్ని కేసీఆర్ ఎదురు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. పోలీస్ ఉన్నతాధికారులకు కూడా సరైన సమాచారం లేదు. విచారణకు వెళ్లిన టీం.. ఏదైనా ప్రశ్న కేసీఆర్ ను అడిగితే.. తనకు సంబంధం లేదంటూ కేసీఆర్ ఆన్సర్ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఎలా జరిగింది.. ఎవరెవరి ఫోన్లు ట్యాప్ చేశారనే వివరాలపై కేసీఆర్ ను ప్రశ్నిస్తే.. అదంతా ఇంటలీజెన్సీ పని అంటూ చెప్పుకొచ్చినట్లు సమాచారం.

**మున్సిపాలిటీ ఎన్నికలపై కేసీఆర్ రివ్యూ**

సిట్ విచారణ తర్వాత నందినగర్ నివాసంలో అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో ప్రత్యేకంగా కేసీఆర్ సమావేశం అయ్యారు. ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నిలపై చర్చించారు. అభ్యర్థుల విజయావకాశాలపై ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఇన్‌ఛార్జ్‌లతో ప్రతి మున్సిపాలిటీ గురించి అడిగి తెలుసుకున్నారు. రెబల్స్ ఎక్కడెక్క ఉన్నారు. వారితో మాట్లాడి నామినేషన్లు ఉపసంహరించేలా చేయాలని చెప్పారు. కచ్చితంగా ఎక్కువ మున్సిపాలిటీలు గెలుస్తున్నామని నేతలకు కేసీఆర్ చెప్పారు.

**మనదే బలం**

బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో చాలా బలంగా ఉందని కేసీఆర్ నేతలకు తెలిపారు. క్షేత్రస్థాయి సమాచారం తనకు ఎప్పటికప్పుడు వస్తుందని వివరించారు. మున్సిపాలిటీల్లో మంచి ఫలితాలు చూస్తామన్న ఆయన ప్రజల ఆదరణ బీఆర్ఎస్ వైపే ఉందని పేర్కొన్నారు. తొందరపాటుతో పార్టీ మారిన చాలా మంది మళ్లీ గులాబీ గూటికి వచ్చేందుకు రెడీ అవుతున్నారని కేసీఆర్ వెల్లడించారు. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు చాలా మంది సంప్రదిస్తున్నట్టు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ నుంచి సీనియర్లు, కీలక నేతలు గులాబీ కండువాలు కప్పుకోనున్నారని హింట్ ఇచ్చారు. భారీగా చేరికలతో ఉన్న వారికి ఇబ్బంది రాదని హామీ

ఇప్పుడు ఉన్న నేతలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నేతల చేరికలు ఉంటాయని కేసీఆర్ తెలిపారు. అందరికీ ప్రాధాన్యత ఇస్తామని, కొత్తగా చేరేవారిని కలుపుకొని వెళ్లాలని సూచించారు. ప్రజల్లో పార్టీ మంచి మైలేజీ వస్తుందని ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులకే గుర్తింపు వస్తుందని హితవు పలికారు. కొత్తగా వచ్చిన వారిని ఇప్పుడు ఉన్న వారిని సమన్వయం చేసుకొని సాగాలని తెలిపారు. ఈ సమావేశం తర్వాత ఆయన ఎర్రవల్లికి తిరిగి వెళ్లిపోయారు.

## నేరాలు చేసినా.. విచారించొద్దంటే ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

సులు ఇస్తే.. తెలంగాణ జాతిపితకే నోటీసులు ఇస్తారా? అని బీఆర్ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్లు తెలంగాణ ప్రజలను విస్మరించన వాళ్లు, ఉద్యమకారులను చిత్రహింసలకు గురిచేసిన వారు జాతిపితలు ఎలా అవుతారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ జాతిపిత అయితే దేనికి ఆదర్శం అని అడిగారు. బీఆర్ఎస్ పాలనలో ఇబ్బందిపడని ఉద్యమకారుడు లేడన్నారు. ఎంతో మంది ఉద్యమకారులను అరెస్టులు చేసి వేధించారని ఆరోపించారు. ఇళ్ల తలుపులు బద్దలు కొట్టి.. బెడ్‌రూమ్‌ల నుంచి ఈడ్చుకెళ్లిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు అవేమీ కనిపించడం లేదని చెప్పారు. సోమవారం హైదరాబాద్, బంజారాహిల్స్ లోని రావి నారాయణ రెడ్డి మెమోరియల్ ఆడిటోరియంలో ప్రతిష్టాత్మక 'రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు–ప్రదానోత్సవ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. పదవులు, రూ. వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న మీరు ఉద్యమకారులు ఎలా అవుతారని సీఎం ప్రశ్నించారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేసి దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని చెప్పారు. మరి ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని నిలదీశారు. గతంలో తలుపులు బద్దలు కొట్టి ఆయన్ను అరెస్టు చేసింది మీ పాలనలో కాదా.. అప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని దుయ్యబట్టారు. పోలీసులు మిమ్మల్ని అలా తలుపులు బద్దలు కొట్టి తీసుకురాలేదనే విషయాన్ని గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. కేవలం నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారన్నారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని సీఎం చెప్పారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారు ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందేనని అంబేద్కర్ చెప్పారనీ.. మరోవైపు శిబు సోరెన్ లాంటి వాళ్లూ విచారణ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ దైవాంశ సంభూతుడేం కాదన్నారు. మధ్యయుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసే వారన్న సీఎం.. ఇప్పుడా మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని చురకలంటిచారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకోవాలన్న ఆయన హుందాగా వ్యవహరిస్తే కొంతైనా మీ గౌరవం నిలబడేదని కేసీఆర్‌ను ఉద్దేశించి చెప్పారు. ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం? ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం ? ఇదెక్కడి జాతిపిత లక్షణం? అన్నారు. కేసీఆర్ చేసిన తప్పులకే సిట్ అధికారులు ఆయనకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. అయితే తాను ఎక్కడ ఉంటే అక్కడికే వచ్చి విచారణ చేయాలనడం కరెక్ట్ కాదన్న రేవంత్ రెడ్డి.. అక్రమాలకు పాల్పడిన ఎవరైనా విచారణను ఎదుర్కోవాల్సిందే అన్నారు. వచ్చిన తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబ సభ్యులే పంచుకున్నారని సీఎం విమర్శించారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుందన్నారు. ఆ ప్రజా తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని రావి నారాయణరెడ్డి చాటి చెప్పారని సీఎం వ్యాఖ్యానించారు. దేశంలో అధిక మెజారిటీతో గెలిచిన ఎంపీగా రావి నారాయణ రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. ఆయన అన్ని పదవులను త్యాగం చేసిన గొప్ప నాయకుడన్నారు. కానీ ఈ రోజుల్లో ప్రజలు ఓడించినా పదవులు వదులుకునేందుకు ఇష్టపడటంలేదని కేసీఆర్‌ను ఉద్దేశించి చెప్పారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాసేలా ఎస్ఐఆర్ ను తీసుకువచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ కేంద్ర కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో రాజ్యాంగంపై దాడి జరుగుతోందన్న సీఎం.. ప్రజల్లో చైతన్యం కలిగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

## న్యాయ నియామకాల్లో పారదర్శకత పెరగాలి



**ముద్ర, న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా న్యాయ నియామకాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఐఏఎస్, ఐపీఎస్ తరహాలోనే అఖిల భారత న్యాయ సేవను వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన రాజ్యసభలో మాట్లాడారు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో ప్రస్తుతం ఉన్న విధానంతో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. దీని స్థానంలో ఓ జాతీయ స్థాయి వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల మాదిరిగానే, న్యాయమూర్తుల ఎంపికకు కూడా ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉండాలని వ్యాఖ్యానించారు. దీంతో ప్రతిభావంతులైన యువతకు న్యాయ వ్యవస్థలో సరైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అఖిల భారత న్యాయ సేవ ఏర్పాటుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయ వ్యవస్థలో తగిన ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. నియామకాల్లో పారదర్శకత పెరగడంతో న్యాయ వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సమర్థులైన న్యాయమూర్తులు తక్కువ వయస్సులోనే విధుల్లోకి రావడంతో కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 312 ప్రకారం అఖిల భారత న్యాయ సేవను ఏర్పాటు చేసే అధికారం పార్లమెంటుకు ఉందని లక్ష్మణ్ గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా ఒకే రకమైన నిబంధనలు, వేతనాలు, శిక్షణా విధానం ఉండటంతో న్యాయ పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికే అనేక రాష్ట్రాలు, న్యాయ నిపుణులు దీనిపై సుదీర్ఘంగా చర్చిస్తున్నారని తెలిపారు. త్వరలోనే కేంద్రం దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని డాక్టర్ లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వం దృష్టి తీసుకొచ్చారు.

## దేశం నుంచి దోచుకెళ్లిన విగ్రహాలు ఇండియాకు..

భారత దేశం వేల ఏళ్ల చరిత్ర కలిగిన దేశం. మన దేశ సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం. ఇక ఒకప్పుడు భారత్ సంపదతో తులతూగేది. ఆర్థికంగా ప్రపంచంలో అగ్రస్థానంలో ఉండేది. అయితే వలసవాదులు, రాజులు, నవాబుల దాడులతో మన సంపదను దోచుకుపోయారు. అనేక విలువైన విగ్రహాలను ధ్వంసం చేశారు. చాలా విగ్రహాలను తరలించుకుపోయారు. కొందరు భారతీయులు కూడా మన దేశా విగ్రహాలను అక్రమంగా ఇతర దేశాలకు అమ్ముకున్నారు. బ్రిటిష్ కాలంలో ఈ స్మగ్లింగ్ ఎక్కువగా జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా విగ్రహాల తరలింపు కొనసాగింది.

**విగ్రహాలు తీసుకురావడానికి..**

భారత్ నుంచి తరలించుకుపోయిన విగ్రహాలను తిరిగి తీసుకురావడానికి భారత్ పెద్ద ఉద్యమమే చేస్తోంది. ఇందులో భాగంగా అనేక దేశాలతో చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో ఒక విజయం సాధించింది. అమెరికాలోని స్మిత్‌సోనియన్ నేషనల్ మ్యూజియం ఆఫ్ ఆసియన్ ఆర్ట్స్ మూడు హిందూ విగ్రహాలను తిరిగి ఇవ్వడానికి అంగీకరించింది.

**ఉద్యమ విజయం..**

భారత ఉద్యమకారులు అంతర్జాతీయ చట్టాలు, డిప్లొమసీ ద్వారా విగ్రహాలను తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మ్యూజియంపై ఒత్తిడి, చర్చలు ఫలితాలు ఇచ్చాయి. ఈ క్రమంలో అమెరికాలోని స్మిత్ సోనియన్ నేషనల్ మ్యూజియం ఆఫ్ ఆసియన్ ఆర్ట్స్ మూడు విగ్రహాలను తిరిగి ఇవ్వడానికి సుముఖత తెలిపింది.

**అరదైన విగ్రహాలు..**

అమెరికా భారత్‌కు తిరిగి అప్పగిస్తున్న విగ్రహాలు చాలా అరుదైనవి. ఒకటి 12 శతాబ్దం నాటి సోమస్కందమూర్తి విగ్రహం. ఇందులో శివుడు, కుమారస్వామి కలిసి ఉంటారు. ఇక రెండోది 16వ శతాబ్దం నాటి అరుదైన శివపార్వతుల విగ్రహం. మూడోది 990వ సంవత్సరం నాటి నటరాజ స్వామి విగ్రహం. ఈ మూడు విగ్రహాలు త్వరాలోనే భారత్‌కు తిరిగి రానున్నాయి.

విగ్రహాలు తిరిగి తీసుకురావడం భారత వారసత్వాన్ని బలోపేతం చేస్తాయి. టూరిజం పెరిగి, దేశీయ గర్వం పెంచుతాయి. భవిష్యత్తులో మరిన్ని విగ్రహాలను తీసుకువచ్చే అవకాశం ఉంది.

## తెలంగాణకే తాడిచర్ల-1 గనులు




**న్యూఢిల్లీ, ముద్ర:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్ల–1 బొగ్గు గనులు తెలంగాణకే కేటాయించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2015 ఆగస్టు 31న తాడిచర్ల–1 గనులను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థకు కేటాయించినట్లు తెలిపారు.

2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదికను కేంద్రం ఆమోదించిన తర్వాత, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపు విధానంలో మార్పులు తీసుకొచ్చినట్లు చెప్పారు. వ్యాపార అవసరాల కోసం గనులను వేలం ద్వారానే కేటాయించాలని, ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే నేరుగా కేటాయింపులు చేయాలని కమిటీ సూచించినట్లు వివరించారు. తాడిచర్ల–2 గనులు ఇప్పటివరకు ఎవరికీ కేటాయించలేదని స్పష్టం చేశారు.

అదే సమయంలో రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా తెలంగాణకు కేటాయింపులు లేవని అనిల్ కుమార్ యాదవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, వేలం ప్రక్రియలో రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న విమర్శలపై స్పందించిన కిషన్ రెడ్డి, తాడిచర్ల–1 గనుల కేటాయింపు తెలంగాణకే జరిగిందని మరోసారి స్పష్టం చేశారు.

## ట్రంప్‌పై అభిశంసన.. మహూర్తం ఫిక్స్

అగ్రరాజ్యం అమెరికాలో ఆ దేశ అధ్యక్షుడిపై ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోంది. ఏడాదిలోనే ట్రంప్ గ్రాఫ్ గతంలో ఎరికీ లేనంతగా పడిపోయింది. మరోవైపు న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ట్రంప్ బలపర్చిన అభ్యర్థి ఓడిపోయారు. ఇక ట్రంప్ పాలనలో ఇప్పటికే నెల షట్‌డౌన్ అయిన అమెరికా మరోమారు అదే ప్రమాదం అంచున ఉంది. ఈ నేపథ్యలో అమెరికా ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు డొనాల్డ్ ట్రంప్‌పై మరో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నారు. మార్చి 31 లోపు దీన్ని సాధించాలని ప్రణాళిక రూపొందించారు. అల్ గ్రీన్ వంటి నేతలు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

వ్యతిరేకతకు కారణాలు..

రెండో మారు అధికారంలోకి వచ్చిన ట్రంప్ చర్యలు, తీసుకుంటున్న నిర్ణయాలు, రూపొందిస్తున్న చట్టాలు ఏవీ ప్రజామోదయోగ్యంగా ఉండడం లేదు. అక్రమ వలసదారులపై దళాలు, మిన్నెసోటా కాల్పుల ఘటనలు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వైఫల్యాన్ని హైలైట్ చేశాయి. సుంకాల వల్ల ధరల ఆకాశంగమనం చిన్న వ్యాపారాలు, పౌరుల్లో అసంతృప్తి పెంచింది. మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికైయ్యేందుకు ట్రంప్ ప్లాన్ చేస్తున్నారని, రాజ్యాంగం సవరించే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు న్నాయి.

**రిపబ్లికన్ మద్దతు కోసం ప్రయత్నాలు**

రిపబ్లికన్ ఆధిపత్య సభలో డెమోక్రాట్లు మెజారిటీ లేకపోవడంతో, పార్టీలోని ట్రంప్ వ్యతిరేకుల మద్దతు కోరుతున్నారు. ట్రంప్ చర్యలు స్వంత పార్టీలో కూడా అసహనాన్ని రేకెత్తిస్తోంది. దీంతో అభిశంసనకు రిపబ్లికన్ సభ్యులు మద్దతు ఇస్తారని భావిస్తున్నారు. ఈ అభిశంసనను 2026 మధ్యంతర ఎన్నికలకు ఆయుధంగా ఉపయోగిస్తున్నారు. ట్రంప్ అధికారంతో ఎన్నికలపై ప్రభావం చూపించకుండా ఆపాలని భావిస్తున్నారు. మరోవైపు ట్రంప్ తన సపోర్టర్లను అప్రమత్తం చేస్తూ, మెజారిటీ కోల్పోతే ప్రతీకార చర్యలు తీసుకుంటారిని భావిస్తున్నారు.

ప్రతినిధుల సభలో తీర్మానం ఆమోదమైనా, సెనెట్‌లో రిపబ్లికన్ బలంతో ట్రంప్ పదవి కోల్పోయే అవకాశం తక్కువ. అయితే, ఈ రాజకీయ రచ్చ ట్రంప్ ఇమేజ్‌ను దెబ్బతీస్తుంది. లేదా పార్టీలో చీలిక తెస్తుంది. మార్చి 31 డెడ్‌లైన్ ఒత్తిడి పెంచే ఎత్తుగడగానే కనిపిస్తోంది.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
03.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**

**చార్మినార్ (తెలంగాణ):** హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఈ చారిత్రక కట్టడం నగరం యొక్క చిహ్నంగా నిలుస్తుంది. దీని చుట్టూ ఉండే లాడ్ బజార్ షాపింగ్‌కు మరియు ఇక్కడి బిర్యానీ రుచులకు చాలా ఫేమస్.



# సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్

- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం
- సంక్షోభం ఉన్నా రెండేళ్లలో సంక్షేమ రాష్ట్రంగా తీర్చిదిద్దాం
- ఆధునీకరించిన ఐఅండ్ పిఆర్ వెబ్‌సైట్ ను ప్రారంభించిన
- మంత్రి పొంగులేటి



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఏ మార్పు కావాలని తెలంగాణ ప్రజలు ప్రజా ప్రభుత్వంపై విశ్వాసం ఉంచారో రెండేళ్లలోనే ఆ మార్పు స్పష్టంగా చూపించి ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థిక రంగంలో పెను సంక్షోభం ఉందన్నారు. ఒక్కో మెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయని అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నామన్నారు. ఆర్థికావృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందనీ తెలంగాణను భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్ధేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఅండ్ పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీఎం సీపీఆర్‌వో జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్ , జాయింట్ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు.



# భావప్రకటన స్వేచ్ఛను గౌరవించాలి

- 'సుప్రీం'లో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు
- సోషల్ మీడియా పోస్టుల కేసులపై హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం కోర్టు
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త శశిధర్ గౌడ్ కేసే నేపథ్యం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
సోషల్ మీడియా పోస్టులపై కేసులు నమోదు చేసే విషయంలో తెలంగాణ సర్కార్‌కు అత్యున్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. భావ ప్రకటన స్వేచ్ఛను నొక్కి చెబుతూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమావరం కొట్టివేసింది. హైకోర్టు మార్గదర్శకాల్లో తప్పేమీ లేదని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే.. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త శశిధర్ గౌడ్ (నల్ల బాలు) సీఎం రేవంత్ రెడ్డి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే ఆరోపణలతో పోలీసులు ఆయనపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దీనిపై శశిధర్ గౌడ్ గతంలో హైకోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన న్యాయస్థానం ఆ ఎఫ్ఐఆర్‌లను కొట్టివేసింది. కేసు విచారణ సందర్భంగా హైకోర్టు పోలీసు యంత్రాంగానికి పలు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులపై పోలీసులు కేసులు నమోదు చేయకూడదని చెప్పింది. ప్రతి చిన్న పోస్టుపై ఇష్టం వచ్చినట్లుగా కేసులు పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛను గౌరవించాలని అక్షింతలు వేసింది.

**సుప్రీంకోర్టులో పిటిషన్..**
హైకోర్టు ఇచ్చిన ఈ మార్గదర్శకాలు తమకు ఇబ్బందికరంగా ఉన్నాయని, వీటిని రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ సర్కారు ఇటీవలే సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపిస్తూ.. ఈ మార్గదర్శకాలు పోలీసుల విధులకు ఆటంకంగా మారుతాయని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం హైకోర్టు తీర్పును తాము అభినందిస్తున్నామని పేర్కొంది. ఇలాంటి మార్గదర్శకాలు ఇవ్వడంలో తప్పేమీ లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రభుత్వ పిటిషన్‌ను సోమవారం డిస్మిస్ చేస్తూ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్ధించింది.



# దోషులను జైలుకు పంపించాలి

- మా ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది ?
- ఫోన్లు ట్యాప్ చేసి.. ఉల్టా మాపైనే కేసులు పెట్టారు
- బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మొదట బీజేపీ నేతల ఫోన్లనే ట్యాప్ చేశారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. సంఘ విద్రోహ శక్తులు ఫోన్లను ట్యాప్ చేసినట్లు బీజేపీ నేతల ఫోన్లను ట్యాప్ చేశారని మండిపడ్డారు. అసలు మా ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని సీరియస్ అయ్యారు. సోమవారం నాంపల్లి లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు.మా ఫోన్లు ట్యాప్ చేసి. ఉల్టా మాపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ఎవరు తప్పు చేసినా జైలుకు పంపుతామని గతంలో కేసీఆర్ చెప్పిన ఆ మాటలు ఆయనకూ వర్తిస్తాయని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై జాలి చూపొద్దని.. దోషులను తప్పకుండా జైలుకు పంపించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను విమర్శించే మూర్ఖులంతా అంధులేనని ఎంపీ రఘునందన్ విమర్శించారు. 'కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని ఒక్కొకరు ఒక్కో తీరుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒకే కుటుంబం నుంచి ఒక్కొక్కరు ఒక తీరుగా వ్యాఖ్యానిస్తున్నారన్నారు. బడ్జెట్‌పై ఒక దిక్కు కేటీఆర్.. ఇంకో దిక్కు హరీశ్‌రావు, కవిత మాట్లాడుతున్నారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌లో దక్షిణ భారతదేశానికి ఏడు హైస్పీడ్ రైళ్లు కేటాయిస్తే అందులో హైదరాబాద్‌కు మూడు హైస్పీడ్ రైళ్లు కేటాయించడం జరిగిందని చెప్పారు. ఈ విషయం.. బావబామ్మర్దులకు కనిపించడం లేదా?, అని ప్రశ్నించారు. గత బడ్జెట్ కంటే రైల్వే రంగానికి ఈసారి 15 శాతం ఎక్కువ బడ్జెట్ కేటాయించామన్నారు ఈ బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా అని చెబుతున్నరాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఓసారి బడ్జెట్‌ను పరిశీలించాలని సూచించారు. గతంలో కంటే ఈసారి రూ.1300 కోట్లు రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కేటాయించారని రఘునందన్ రావు స్పష్టం చేశారు.

# మాటలే.. చేతల్లో లేదు..

- బడ్జెట్ లో కానరాని రైతు సంక్షేమం
- ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం కరువు
- పసుపు బోర్డుకు నిధుల్లేవు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ముద్ర, ఖమ్మం :**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు రైతులపై అదనపు భారాన్ని మోపేలా ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆరోపించారు. కేంద్రం ప్రసంగాల్లో రైతు సంక్షేమం గురించి చెబుతున్నా.. బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం అది ఎక్కడా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు ప్రోత్సాహానికి కాంగ్రెస్ సర్కార్.. కృషి చేస్తుంటే కేంద్రం మాత్రం అందుకు అడ్డంకులు సృష్టిస్తోందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రైతులకు, రాష్ట్ర వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం జరిగిందని ఆయన విమర్శించారు. సోమవారం ఖమ్మంలో మీడియాతో మాట్లాడారు. విదేశాల నుంచి దిగుమతి అయ్యే ముడి పామాయిల్‌పై దిగుమతి సుంకం పెంచాలని తాము పదేపదే విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. దీంతో దేశీయ రైతులకు గిట్టుబాటు ధర లభించడం కష్టతరమవుతోందన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఎంతో కీలకమైన జాతీయ పసుపు బోర్డుకు బడ్జెట్ లో నామమాత్రపు నిధులు కూడా కేటాయించకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం బోర్డు ఏర్పాటు పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆచరణలో రైతులకు మేలు చేసే నిధులు కరువయ్యాయని అన్నారు. తెలంగాణలో కొబ్బరి సాగు గణనీయంగా పెరుగుతున్నా, రాష్ట్రంలో కొబ్బరి బోర్డు ఏర్పాటుపై కేంద్రం ఎలాంటి ప్రకటనా చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాల్సిన కేంద్రం, ఎరువులపై సబ్సిడీలు తగ్గించడం ద్వారా ధరలు పెరిగేలా చేస్తోందని మంత్రి విమర్శించారు. ఎరువుల ధరల పెంపుతో సాగు ఖర్చులు భారమై, రైతులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉందన్నారు. నిర్మలా బడ్జెట్ తెలంగాణ రైతుల ఆశలపై నీళ్లు చల్లిందని, కేంద్రం తన వైఖరిని మార్చుకుని రాష్ట్రానికి రావాల్సిన వాటాను, నిధులను వెంటనే కేటాయించాలని తుమ్మల డిమాండ్ చేశారు.

# విద్యా రంగానికి పెద్దపీట

- తెలంగాణకు యూనివర్సిటీ టౌన్‌షిప్
- కేంద్ర బడ్జెట్ లో విద్యారంగానికి పెద్దపీట
- గతేడాదితో పోలిస్తే 6.22 శాతం అధికం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కేంద్ర ప్రభుత్వం 202627 బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి పెద్దపీట వేసింది. రాష్ట్రానికి మరిన్ని కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించింది. దేశవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఐదు యూనివర్సిటీ టౌన్‌షిప్‌లలో ఒకటి తెలంగాణకు కేటాయించే అవకాశాలున్నాయి. ఈ బడ్జెట్‌లో కేంద్రం విద్యా రంగానికి కేటాయింపులు పెంచడంతో.. తెలంగాణకు వచ్చే నిధులు కూడా భారీగా పెరగనున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి బడ్జెట్‌లో 6.22 శాతం అధికంగా కేటాయించడం విశేషం. తాజా బడ్జెట్‌లో హైదరాబాద్ నుంచి మూడు హైస్పీడ్ కారిడార్ రైళ్లను ప్రకటించిన కేంద్రం.. ఇందిరమ్మ ఇళ్లకు పీఎం ఆవాస్ యోజన కింద భారీగా నిధులు కేటాయించింది. వీటితో ఈ బడ్జెట్‌లో తెలంగాణ విద్యారంగానికి కూడా పెద్ద పీట వేసింది. రాష్ట్రానికి మరిన్ని కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాలను కేటాయించింది. కేంద్రం బడ్జెట్‌లో ఈ సంవత్సరానికి గాను విద్యా రంగం కేటాయింపులను భారీగా పెంచారు. ముఖ్యంగా రాష్ట్రంలోని కేంద్రీయ విద్యాయాలు (కేవీ), జవహర్ నవోదయ విద్యాలయాలు (జేఎన్‌వీ) ను మరింత అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 35 కేవీలు ఉన్నాయి. ఈ క్రమంలో ములుగు, జగిత్యాల, కొత్తగూడెం, వనపర్తి జిల్లాలకే కేంద్రం ఇటీవల కేవీలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 9 జవహర్ నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఈక్రమంలో కేంద్రం కొత్తగా మరో 7 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేసింది. వీటితో పాటు.. దేశవ్యాప్తంగా 5 యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వీటిల్లో ఒకటి తెలంగాణకు కేటాయించే అవకాశాలున్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# కాదని పోటీ చేస్తే సస్పెండ్

- రెబెల్స్ కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హెచ్చరిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఎవరైనా పార్టీ నిబంధనలు అతిక్రమించి మున్సిపల్ ఎన్నికల్లో రెబల్స్‌గా బరిలోకి దిగితే కనికరం లేకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుహెచ్చరించారు. నామినేషన్లు వేసిన ఇతర అభ్యర్థులు ఉపసంహరించుకోవాలని సూచించారు. పార్టీ బీఫామ్‌లు ఇచ్చిన అభ్యర్థులకు అందరూ సహకరించాల్సిందే అని తేల్చి చెప్పారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ శ్రేణులు, అనుబంధ సంఘాలన్నీ కలిసికట్టుగా పని చేయాలన్నారు. అత్యధిక పుర పీఠాలపై కాషాయ జెండా ఎగురవేసి.. ప్రధానమంత్రి నరేంద్రమోడికి బహుమతిగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అన్నీ అరాచక, అవినీతే జరిగిందని అభివర్ణించారు. ఈ మేరకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని



విమర్శించారు. ఇప్పటి వరకు రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తుచేశారు రాష్ట్రంలో నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# 'ట్యాపింగ్' ఎక్కడ జరిగిందో చెప్పండి

- చట్టాన్ని గౌరవించే కేసీఆర్ విచారణకు హాజరయ్యారు
- కక్షసాధింపుతోనే కేసులు
- కేసును సీరియల్ లా నడుపుతున్నారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చేపడుతోన్న సిట్ అధికారులు అసలు ఫోన్‌ట్యాపింగ్ ఎక్కడ జరిగిందో చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నిచారు. ఈ కేసును సీరియల్ మాదిరి నడిపిస్తున్నారని విమర్శించారు. అసలు ఫోన్ ట్యాపింగే జరగలేదని సిట్ విచారణలో కేసీఆర్ చెప్పారని, వాస్తవానికి సిట్ విచారణకు కేసీఆర్ రావాల్సిన అవసరం లేదన్నారు. చట్టాన్ని గౌరవించే కేసీఆర్ విచారణకు హాజరు అయ్యారన్నారు. హరీశ్‌రావుకు సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందన్న ఆయన ఫోన్ ట్యాపింగ్ ఘట్టాన్నిఇంతటితో ముగించాలన్నారు. సోమవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. కేసీఆర్ విచారణను నిరసిస్తూ 7 వేల గ్రామాల్లో సీఎం దిష్టి బొమ్మలు తగలబెట్టారని చెప్పారు. దీంతో ఆనాటి ఉద్యమ స్ఫూర్తి గుర్తొచ్చిందని చెప్పారు. మమ్మల్ని తట్టి లేపిన రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ విచారణ కోసం ఏర్పాటు చేసిన పోలీసులను.., శాంతిభద్రతలపైనా దృష్టి పెడితే బావుంటుందన్నారు. సుల్తాన్ బజార్‌లో పట్టపగలే ఏటీఎం దగ్గర చోరి జరిగిందని, నల్లమల సాగర్‌తో తెలంగాణకు నీళ్ల దోపిడి జరుగుతుందని కేటీఆర్ ఆరోపించారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్ రెడ్డి.. సాయంత్రానికి ఢిల్లీ వెళ్లారని మండిపడ్డారు. ఢిల్లీకి తాకిన సింగరేణి కుంభకోణం గురించి వాస్తవాలను బయట పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుమారుడు అమాయకుల భూములను కబ్జా చేస్తున్నాడని, అతనిపై కేసు పెట్టిన సీఐ హాబీబుల్లా ఖాన్‌ను అందుకే బదిలీ చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి బామ్మర్ది బండారం బయట పెట్టామనే కోపంతోనే ప్రభుత్వం సిట్ విచారణలను తెరపైకి తెచ్చిందని ఆరోపించారు.

**సజ్జనార్ జడ్జి కాదు:**
ఫోన్ ట్యాపింగ్ కేసు సిట్ చీఫ్ సజ్జనార్ జడ్జి కాదని ఆయన కేవలం పోలీసు అధికారి మాత్రమేనని కేటీఆర్ మండిపడ్డారు. సజ్జనార్ అయినా ఇంకో అధికారి అయిన ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అనుకుంటే కోర్టుకు వెళ్లాలి కదా అని ప్రశ్నించారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు అంటూ సజ్జనార్ చేసిన ట్వీట్ పై స్పందిస్తూ కౌంటర్ ఇచ్చారు.

**నిప్పుతో చెలగాటమాడుతున్నారు...**
కేసీఆర్ వంటి తెలంగాణ రాష్ట్ర సాధకుడిని వేధిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, కాంగ్రెస్ ప్రభుత్వం నిప్పుతో చెలగాటం ఆడుతోందని హెచ్చరించారు. కేసీఆర్‌ను సుదీర్ఘంగా 4:30 గంటల పాటు విచారించడం కేవలం రాజకీయ పైశాచికానందం కోసమేనని కేటీఆర్ విమర్శించారు.

**బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి**
కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కేసీఆర్ విచారణకు ముందు, తర్వాత కూడా చర్చించారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ పథకాలను కాపీ కొట్టిన కేంద్రం, రాష్ట్రానికి మాత్రం పైసా విదల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బయో ఫార్మాకు అడ్డా అయినప్పటికీ ఒక్క రూపాయి కేటాయించలేదని, బిఆర్ఎస్ ఇప్పటికే మహిళా రెసిడెన్షియల్ స్కూల్స్ పెడితే, ఇప్పుడు కేంద్రం జిల్లాకో స్కూల్ అంటూ కొత్తగా చెబుతోంది. రాష్ట్రం నుంచి 16 మంది ఎంపీలు ఉన్నా.., వారు సాధించింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
మంగళవారం 03.02.2026
www.mudranews.in
@mudranews
mudratv



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## న_కలం

# మన రియల్ ఎస్టేట్‌కు పాఠమా?



ఒకవైపు హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో అమ్ముడుపోని అపార్ట్‌మెంట్లు, ఖాళీగా నిలిచిపోయిన బిల్డింగులు... మరోవైపు డిమాండ్ ఉందని చెప్పుకుంటూ ధరలు పెంచాలని కోరుకునే రియల్ ఎస్టేట్ వ్యాపారులు. భారతీయ నగరాల రియల్ ఎస్టేట్ పరిస్థితి ఇదే. ఈ క్రమంలో దక్షిణ కొరియా రాజధాని సియోల్ పరిస్థితి మనకు ఒక హెచ్చరికగా కనిపిస్తోంది.

సియోల్‌లో అపార్ట్‌మెంట్ ధరలు వారానికి ఒకసారి పెరుగుతున్నాయి. ఏడాది పొడవునా వరుసగా 52 వారాలు ధరలు పెరిగాయంటే పరిస్థితి ఎంత తీవ్రమో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వాలు ఎన్ని కఠిన నిబంధనలు పెట్టినా హోం లోన్లపై ఎంత కట్టడి చేసినా మార్కెట్ మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా దూసుకుపోతోంది. ఫలితం ఏమిటి? ఒక మధ్యతరగతి ఉద్యోగి 30 ఏళ్లు పని చేసి, రిటైర్ అయిన తర్వాత సియోల్‌లో ఉండలేని పరిస్థితి. ఇది అభివృద్ధి విజయమా? లేక విధాన పరాజయమా?

సియోల్ జనాభా దాదాపు 93 లక్షలు. విస్తీర్ణం పరంగా చిన్న నగరంలో ఇంత భారీ జనసాంద్రత ఉండటం సహజంగానే రియల్ ఎస్టేట్‌పై ఒత్తిడిని పెంచింది. ముఖ్యంగా యువత ఫ్లాట్ కొనుగోలునే జీవిత లక్ష్యంగా భావించే స్థితికి చేరడం ఆందోళన కలిగించే అంశం. పెళ్లి, కుటుంబం తర్వాత.. ముందుగా ఇల్లు కంపల్సరీగా భావిస్తున్నారు.. ఇది సామాజిక మార్పు మాత్రమే కాదు, ఆర్థిక ఒత్తిడికి ప్రతిబింబం.

ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం.. సియోల్ సమస్య ఒక్కరోజులో ఏర్పడింది కాదు. దశాబ్దాలుగా రాజధానికే అభివృద్ధిని కేంద్రీకరించడం.. ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ భౌగోళిక అసమతుల్యత ఏర్పడింది. ప్రభుత్వ కార్యాలయాలు, ఐటీ కంపెనీలు, టాప్ యూనివర్సిటీలు, అధిక వేతన ఉద్యోగాలు.. అన్నీ ఒకేచోట. ఫలితంగా దేశమంతా రాజధానికే క్యూ కట్టింది. సెజోంగ్ నగరాన్ని పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చేసినా.. సియోల్‌పై ఒత్తిడి తగ్గలేదు.

ఇక లోన్ల విషయానికి వస్తే.. భారతదేశంతో పోలిస్తే సియోల్ చాలా కఠినం. మన దగ్గర ఫ్లాట్ విలువలో 80–90 శాతం వరకు లోన్ వస్తే, అక్కడ కేవలం 40 శాతమే. అయినా ధరలు పెరుగుతున్నాయంటే అది డిమాండ్ తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది. న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ లాంటి దేశాలు కూడా ఇలాంటి కఠిన విధానాలనే అమలు చేస్తున్నాయి. అయినా సమస్య పూర్తిగా అదుపులోకి రావడం లేదు.

ఇప్పుడు ప్రశ్న మనదే.. భారత నగరాలు కూడా అదే దారిలో నడుస్తున్నాయా? ముంబయి, బెంగళూరు, హైదరాబాద్‌లలో ఒకవైపు వేలాది అపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉండగా, మరోవైపు ధరలు మాత్రం తగ్గడం లేదు. ఇది నిజమైన డిమాండా? లేక స్పెక్యులేషన్‌తో సృష్టించిన బుడగనా? అన్నది అర్థం చేసుకోవాలి.

సియోల్ అనుభవం చెబుతున్న పాఠం స్పష్టం.. అభివృద్ధిని ఒకేచోట కేంద్రీకరిస్తే గృహం సాధారణ మనిషికి అందని కలగా మారుతుంది. ధరల నియంత్రణ ఒక్కటే పరిష్కారం కాదు. అభివృద్ధి వికేంద్రీకరణ, ఉద్యోగాల సమాన పంపిణీ, మౌలిక వసతుల విస్తరణ.. ఇవే దీర్ఘకాలిక మార్గాలు.

లేదంటే ఈ రోజు సియోల్ కథ మనం వార్తల్లో చదువుతాం. రేపు అదే కథ మన నగరాల సంపాదకీయాల శీర్షిక అవుతుంది.

# అక్షర కిరణాల సాక్షిగా కులపు చీకట్లు..!

## యూజీసీ మార్గదర్శకాలపై న్యాయ-సామాజిక ఘర్షణ

భారతదేశం ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు జరుపుకుని 'వికసిత్ భారత్' వైపు అడుగులు వేస్తున్న వేళ, మన ఉన్నత విద్యా సంస్థల గడపల వద్ద ఇంకా కులపు వివక్ష రక్కసి కోరలు చాచి ఉండటం జాతికే సిగ్గుచేటు. విజ్ఞాన శాస్త్రంలో విశ్వగురువులుగా ఎదగాలని కలలు గంటున్న తరుణంలో, క్యాంపస్‌ల లోపల విద్యార్థుల ప్రతిభను వారి పుట్టుకతో కొలవడం ఒక సామాజిక వైఫల్యం. ఈ రుగ్మతను రూపుమాపడానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) తీసుకువచ్చిన కొత్త 'ఈక్విటీ మార్గదర్శకాలు' ఇప్పుడు న్యాయస్థానాల మెట్ల వద్ద నిలిచాయి. సామాజిక న్యాయం అందించాలనే తపన, చట్టపరమైన సమతుల్యత మధ్య తలెత్తిన ఈ ఘర్షణ విద్యా రంగంలో ఒక కొత్త చర్చకు తెరలేపింది. సుప్రీంకోర్టు ఈ నిబంధనలపై విధించిన స్టే, యూజీసీ చేస్తున్న ప్రయత్నాల్లోని అస్పష్టతను మరియు లోపాలను ఎత్తిచూపుతోంది.

విద్యాసంస్థలు అనేవి కేవలం డిగ్రీలను ముద్రించే యంత్రాలు కావు; అవి రేపటి పౌరుల ఆలోచనా దృక్పథాన్ని నిర్మించే కర్మాగారాలు. అటువంటి చోట ఒక విద్యార్థి తన కులం కారణంగా చిన్నచూపుకు గురైతే, అది ఆ వ్యక్తి ఆత్మగౌరవంపై జరిగే దాడి మాత్రమే కాదు, రాజ్యాంగం కల్పించిన సమానత్వపు ఆశయానికి గొడ్డలి పెట్టు. ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలలో దళిత, గిరిజన విద్యార్థుల ఆత్మహత్యల పరంపర ఆగిపోవడం లేదు. ఇవి కేవలం మానసిక ఒత్తిడి వల్ల జరిగిన మరణాలు కావు, ఇవి వ్యవస్థీకృత సామాజిక బహిష్కరణల ఫలితం. రిజర్వేషన్ల ద్వారా వచ్చిన వారిని 'మెరిట్' లేని వారిగా ముద్ర వేయడం, ల్యాబ్ సెషన్లలో ఒంటరిని చేయడం, వైవా పరీక్షల్లో తక్కువ మార్కులతో వేధించడం వంటి సూక్ష్మ రూపాల్లో వివక్ష నేటికీ రాజ్యమేలుతోంది. ఈ అదృశ్య వేధింపులను అరికట్టడానికి యూజీసీ తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమే అయినప్పటికీ, ఆ నిబంధనల రూపకల్పనలో ప్రదర్శించిన తొందరపాటు ఇప్పుడు విమర్శలకు దారితీసింది.

చారిత్రక కోణంలో చూస్తే, మండల కమిషన్ సిఫార్సుల అమలు సమయంలో కూడా దేశం ఇలాంటి అస్థిరతనే చూసింది. అప్పట్లో రిజర్వేషన్లు అంటే కేవలం ఉద్యోగాల కోటా మాత్రమే అనుకున్నారు, కానీ అవి సామాజిక గౌరవానికి చిహ్నాలని కాలం నిరూపించింది. నేడు యూజీసీ మార్గదర్శకాలు కూడా అలాంటి ఒక విప్లవాత్మక మార్పు కోసమే ఉద్దేశించబడ్డాయి. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 మరియు 16 మధ్య ఉన్న సన్నని గీతను అర్థం చేసుకోవడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. వివక్షను నిర్వచించడంలో ఉన్న అస్పష్టత వల్ల, సాధారణ విమర్శలు కూడా వేధింపుల కిందకు వచ్చే ప్రమాదం ఉంది. ఇది క్యాంపస్‌లలో విద్యార్థుల మధ్య స్వేచ్ఛాయుతమైన చర్చలను, భిన్నాభిప్రాయాలను చంపేసి, కేవలం భయంపై ఆధారపడిన నిశ్శబ్దాన్ని నెలకొల్పుతుంది.

సుప్రీంకోర్టు విధించిన స్టే యూజీసీకి తన తప్పులను సరిదిద్దుకోవడానికి ఒక సువర్ణావకాశం. చట్టం ఏకపక్షంగా ఉంటే అది వ్యతిరేకతను మూటగట్టుకుంటుంది. అగ్రవర్ణ విద్యార్థులలో ఉన్న అభద్రతా భావాన్ని, వెనుకబడిన వర్గాలలో ఉన్న వివక్షా భయాన్ని రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఒక మధ్యేమార్గ మార్గదర్శకాన్ని రూపొందించాలి. విద్యాలయాలు రాజకీయం చేసే స్థలాలు కాకూడదు, అవి మేధోమథనం చేసే కేంద్రాలు కావాలి. కులం అనే మురికిని క్యాంపస్‌ల బయటే వదిలేసి, ప్రతిభ మరియు మానవత్వం ప్రాతిపదికన విద్యార్థులు ఒకరినొకరు గౌరవించుకునే రోజు వచ్చినప్పుడే యూజీసీ ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది.




మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే, విచారణ కమిటీల స్వభావం. చాలా సందర్భాల్లో ఈ కమిటీలలో బాధితులకు చెందిన సామాజిక వర్గాల ప్రాతినిధ్యం ఉండటం లేదు. దీనివల్ల బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం కలగడం లేదు. యూజీసీ చేయాల్సింది కేవలం శిక్షలను పెంచడం కాదు, ఆ వ్యవస్థను ప్రజాస్వామ్యీకరించడం. ఫిర్యాదు అందిన వెంటనే నిష్పక్షపాతంగా విచారణ జరిగేలా, అందులో నిపుణులు మరియు వివిధ వర్గాల ప్రతినిధులు ఉండేలా చూడాలి. అలాగే, ఫిర్యాదుల ప్రక్రియలో పారదర్శకత ఉండాలి. సామాజిక మార్పు అనేది కేవలం చట్టాల ద్వారానే రాదు, అది ఆలోచనా ధోరణిలో మార్పు ద్వారా రావాలి. విద్యార్థుల మధ్య ఉన్న సామాజిక అగాధాన్ని తగ్గించడానికి 'సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్స్' నిర్వహించడంలో మన యూనివర్సిటీలు ఘోరంగా విఫలమవుతున్నాయి.

ముగింపులో చెప్పాలంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాలు వేసే 'రెడ్ లైన్' హెచ్చరికలు రాజ్యాంగ రక్షణ కోసం ఉద్దేశించినవి. సామాజిక న్యాయం పేరిట చేసే ఏ సంస్కరణ అయినా అందరికీ ఆమోదయోగ్యంగా, పటిష్టమైన ఆధారాలతో ఉండాలి. అగ్రవర్ణ అహంకారం ఎంత ప్రమాదకరమో, అస్పష్టమైన చట్టాల ద్వారా కలిగే గందరగోళం కూడా అంతే ప్రమాదకరం. ప్రభుత్వం మరియు యూజీసీ ఇప్పటికైనా పంతాలకు పోకుండా, మేధావులు విద్యార్థి సంఘాలతో చర్చించి, వివక్షకు తావులేని, దుర్వినియోగానికి అవకాశం లేని ఒక సమగ్ర విధానాన్ని తీసుకురావాలి. అప్పుడే మన విద్యా కుసుమాలు కులపు వాసన లేని సమానత్వపు తోటలో స్వేచ్ఛగా వికసిస్తాయి. భారతీయ యువత తన మేధస్సుతో ప్రపంచాన్ని శాసించాలంటే, ముందుగా మన క్యాంపస్‌లలో ఉన్న ఈ మధ్య యుగపు వివక్షా సంకెళ్లను తెంచుకోవాలి

### న్యాయస్థానం లేవనెత్తిన ప్రధాన అభ్యంతరం

న్యాయస్థానం లేవనెత్తిన ప్రధాన అభ్యంతరం చట్టం యొక్క దుర్వినియోగం గురించి. గతంలో ఉన్న నిబంధనలలో తప్పుడు ఫిర్యాదులు చేసే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉండేది. కానీ కొత్త ముసాయిదాలో ఆ రక్షణ కవచాన్ని తొలగించడం వల్ల, ఇది అగ్రవర్ణ విద్యార్థులపై లేదా ఫ్యాకల్టీపై కక్షసాధింపు చర్యలకు ఒక సాధనంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. చట్టం అనేది ఎప్పుడూ ఒక బాధితుడిని రక్షించాలే తప్ప, మరొకరిని ముందే నిందితుడిగా చూడకూడదు. "నిరపరాధికి శిక్ష పడకూడదు" అనే న్యాయ సూత్రం ఇక్కడ ప్రశ్నార్థకమైంది. వివక్షను అరికట్టడం అంటే ఒక వర్గంపై మరొక వర్గం ఆధిపత్యాన్ని చెలాయించడం కాదు, అందరికీ సమానమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించడం. ఈ విషయంలో యూజీసీ సమతుల్యతను కోల్పోయిందని, ఒక వర్గం ఆందోళనలను పూర్తిగా విస్మరించిందని పిటిషనర్ల వాదనలో బలం ఉంది.

- వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ
9848559863



# అక్షరానుభూతులు..

అక్షరాలు చూస్తే —
కళ్లల్లో దూరుతున్నాయి,
నిశ్శబ్ద నుదిటిపై
నక్షత్రాల్లా వెలుగుతాయి.

అక్షరాలు వస్తే —
హృదయానికి హరివిల్లై,
అనుభూతుల అంచులపై
అమృతబిందువులై చేరుతున్నాయి.

అక్షరాలు రాస్తే —
వేళ్లకు వేదన ఒక వరమై,
పుటలపై సిరిమువ్వలై
సంగీతపాఠాలు చెబుతున్నాయి.

అక్షరాలు చెబితే —
నోటి నిండా నెయ్యిలా,
అర్థాల అగ్నిలో
ఆలయ దీపాలవుతున్నాయి.

అక్షరాలు రాలితే —
కాలం కడలిలో
జ్ఞాపకాల ముత్యాలై
మౌనానికి అర్థం చెబుతున్నాయి.

అక్షరాలు వెళ్ళితే —
విడిపోతున్న వేళల్లో
మనసుని ముట్టే
వేదనగా మిగిలిపోతున్నాయి.

అక్షరాలు లేస్తే —
నిద్రలేని ఆలోచనలకు
ఉషస్సులై వచ్చి
ఆశలకు అద్దం పడుతున్నాయి.

అక్షరాలు తడితే —
భావాల వర్షంలో
పదాలు పరిమళించి
కవితగా పూస్తున్నాయి.

అక్షరాలు కురిస్తే —
చీకటి గుండెల్లో
వెలుగు నదులై
వేగంగా ప్రవహిస్తున్నాయి.

అక్షరాలు తోస్తే —
ప్రాణాల పడవను
అనంత తీరాలకు
అక్షయంగా నడిపిస్తున్నాయి.

అక్షరాలు –
హృదిని కదిలిస్తున్నాయి,
మదిని తొలుస్తున్నాయి,
జీవనసుధని కురిపిస్తున్నాయి.

అక్షరాలు –
కలమును పట్టిస్తున్నాయి,
ముందుకు నడిపిస్తున్నాయి,
కవనాలు వ్రాయిస్తున్నాయి.



- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం.

# ఏది తింటే ఆరోగ్యానికి మంచిది!

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఆలోచనతో చాలామంది రాత్రి భోజనంలో అన్నానికి బదులు రొట్టెలను ఎంచుకుంటున్నారు. రొట్టెలు కడుపు నింపడమే కాకుండా, సరైన రకాన్ని ఎంచుకుంటే శరీరానికి అవసరమైన పోషకాలను కూడా అందిస్తాయి. అయితే అన్ని రొట్టెలూ ఒకేలా ఉండవు. ఒక్కో రకం రొట్టె ఒక్కో విధమైన లాభాన్ని చేకూరుస్తుంది. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

### గోధుమ రొట్టె

చపాతీలు చాలామందికి ఇష్టమైనవి. అయితే గోధుమలను ప్రాసెస్ చేసినప్పుడు వాటిలోని సహజ ఫైబర్ కొంత తగ్గిపోతుంది. దాంతో గ్లైసెమిక్ ఇండెక్స్ పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే గోధుమ రొట్టెలను మాత్రమే కాకుండా, వాటితో పాటు సోయా, శనగలు లేదా పప్పుదినుసులను కలిపి తీసుకుంటే పోషక విలువ మరింత పెరుగుతుంది.

### మిల్లెట్స్ రోటీ

కాలం ఏదైనా మిల్లెట్స్ రోటీ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో ఫైబర్, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. మిల్లెట్ రోటీ తినడం వల్ల మలబద్ధకం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. అయితే అధికంగా తీసుకోకుండా వారానికి ఒకటి లేదా రెండు సార్లు తీసుకుంటే సరిపోతుంది.

### మక్క రొట్టె

మక్క రొట్టెలో ఫైబర్ ఎక్కువగా ఉన్నప్పటికీ, కార్బోహైడ్రేట్స్ కూడా అధికంగా ఉంటాయి. అందువల్ల ఇది తింటే రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరిగే అవకాశం ఉంది. కాయకష్టం చేసే వాళ్లు లేదా శారీరక శ్రమ ఎక్కువగా చేసే వారికి ఇది మంచి శక్తినిస్తుంది. డెస్క్ జాబ్ చేసే వారు మాత్రం అప్పుడప్పుడు రుచి కోసం మాత్రమే తినడం మంచిది.

### జొన్న రొట్టె

జొన్నల్లో సంక్లిష్ట కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా కొలెస్ట్రాల్ తగ్గించడంలో కూడా జొన్న రొట్టె ఉపయోగపడుతుంది. అధిక బరువుతో బాధపడేవారు జొన్న రొట్టెను రెగ్యులర్‌గా తీసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి.

### రాగి రొట్టె

రాగుల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండటంతో పాటు ఫైబర్ అధికంగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునేవారికి, రక్తంలో చక్కెర నియంత్రణకు ఇది చాలా మంచిది. రాగి రొట్టె ఎముకలను బలపరుస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, దీర్ఘకాలిక శక్తిని ఇస్తుంది. ఇందులో క్యాల్షియం పుష్కలంగా ఉండటంతో మంచి నిద్రకు కూడా దోహదపడుతుంది. అందుకే దీన్ని రెగ్యులర్‌గా ఆహారంలో చేర్చుకోవచ్చు.



రాత్రి భోజనంలో రొట్టెలు తీసుకోవడం ఆరోగ్యకరమే కానీ, మీ శరీర అవసరాలకు తగ్గట్టుగా సరైన రకాన్ని ఎంచుకోవడం చాలా ముఖ్యం. అన్నింటినీ సమతూకంగా తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుంది.

## మీకు తెలుసా?

### రైలు పుట్టినప్పటి కథ!

అమెరికాలో రైళ్లు మొదట ప్రవేశపెట్టినప్పుడు ఆశ్చర్యకరమైన అపోహలు వ్యాపించాయి. మహిళల శరీరాలు 50 మైళ్ళ వేగాన్ని తట్టుకోలేవు.. అంతేకాకుండా వారి గర్భాశయాలు బయటకు వచ్చేస్తాయని కొందరు నమ్మారు! ఇప్పుడు ఇది హాస్యాస్పదంగా అనిపించినా కొత్త సాంకేతికతపై భయాలు ఎలా విచిత్రమైన అపోహలను సృష్టిస్తాయో చూపిస్తుంది. చివరికి శాస్త్రం వాటిని తప్పు అని నిరూపించింది!



**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**

అరకు లోయ (ఆంధ్రప్రదేశ్): విశాఖపట్నం జిల్లాలోని ఈ మన్యం ప్రాంతం మంచు తెరలు, కాఫీ తోటలతో పర్యాటకులను మురిపిస్తుంది. ఇక్కడి బొర్రా గుహలు మరియు జలపాతాలు ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తాయి.



# రెండేళ్లలోనే ప్రజల విశ్వాసం నిలబెట్టుకున్న 'ప్రజా ప్రభుత్వం'

- **సంక్షేమానికి చిరునామాగా కాంగ్రెస్ పాలన : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**ముద్ర, హైదరాబాద్ :**




తెలంగాణ ప్రజలు ఏ మార్పు కోరుకుంటూ ప్రజా ప్రభుత్వంపై విశ్వాసం ఉంచారో, ఆ మార్పును రెండేళ్లలోనే స్పష్టంగా చూపించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్రం అన్ని రంగాల్లో, ముఖ్యంగా ఆర్థిక రంగంలో తీవ్ర సంక్షోభంలో ఉందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కో మెట్టు ఎక్కుతూ సంక్షోభం నుంచి గట్టెక్కి అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకువెళ్తున్నామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పుకు నాంది పలుకుతోందన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో సమాచార పౌరసంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకమని మంత్రి అన్నారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ (ఐఅండ్ పిఆర్) వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాలనకు రెండేళ్లు పూర్తి కావడంతో మూడో వసంతంలోకి అడుగుపెట్టామని, కాలపరంగా రెండేళ్లు తక్కువే అయినా సాధించిన విజయాలు మాత్రం అసాధారణమని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు కొత్త పథకాలను అమలు చేశామన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నామని, ఆర్థిక వృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణను భారతదేశంలోనే కాక ప్రపంచ స్థాయిలోనూ అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐ అండ్ పిఆర్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి. మల్సూర్, సమాచార శాఖ అదనపు డైరెక్టర్ డి.ఎస్. జగన్, జాయింట్ డైరెక్టర్ రమణతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు : ఎస్పీ స్నేహ మెహ్రా

- **జనవరిలో జిల్లావ్యాప్తంగా 22 కేసులు నమోదు**

**ముద్ర, వికారాబాద్ బ్యూరో :**




జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కు పాదం మోపాలని ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలు జారీ చేయడంతో టాస్క్ ఫోర్స్ బృందాలు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో భాగంగా కేవలం జనవరి నెలలోనే జిల్లావ్యాప్తంగా మొత్తం 22 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సహజ వనరుల దోపిడీని అరికట్టే క్రమంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లపై 14కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌పై ఒక కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పర్యావరణానికి, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న నిషేధిత చైనా మాంజా విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టి నాలుగు కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. అక్రమ రవాణాతో పాటు సామాజిక రుగ్మతలపై కూడా టాస్క్ ఫోర్స్ బృందాలు గట్టి నిఘా కొనసాగించాయి. ఇందులో భాగంగా పేకాట స్థావరాలపై దాడులు చేసి ఒక కేసు, మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద ఒక కేసు, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ ఆహార పదార్థాల విక్రయదారులపై మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఆమె కోరారు.




# తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు

**ముద్ర, శేరిలింగంపల్లి :**

తప్పిపోయిన బాలుడిని మియాపూర్ పోలీసులు క్షేమంగా గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మియాపూర్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ న్యూ కాలనీకి చెందిన రాజేష్ కుమారుడు సిద్ధార్థ్ (5) సోమవారం ఉదయం ఇంటి బయట ఆడుకుంటూ దారి తప్పి సుమారు ఒక కిలోమీటర్ దూరం వెళ్లిపోయాడు. ఆ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మియాపూర్ పోలీసులు బాలుడిని గుర్తించి, సుమారు రెండు గంటలపాటు శ్రమించి అతని వివరాలు సేకరించారు. అనంతరం బాలుడిని సురక్షితంగా అతని తల్లిదండ్రులకు అప్పగించారు. ఎంతో వెతికినా బాలుడి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని తల్లిదండ్రులు భావిస్తున్న సమయంలోనే, పోలీసులు ముందుగానే బాలుడిని గుర్తించి క్షేమంగా అప్పగించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. పోలీసుల సత్వర చర్యలను ప్రశంసించారు.

# కాలనీల్లో సుందరమైన వాతావరణం లక్ష్యం

- **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అరికపూడి గాంధీ**

**ముద్ర, శేరిలింగంపల్లి :**




అంతర్గత డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పచ్చదనం వంటి మౌలిక వసతులతో కాలనీలు ఆహ్లాదకర వాతావరణంలో కనిపించాలన్నదే లక్ష్యమని పీఏసీ ఛైర్మన్ అరికపూడి గాంధీ అన్నారు. నల్లగండ్ల, నల్లగండ్ల హుడా కాలనీ, నవోదయ కాలనీ, సైబర్ కమ్యూన్ కాలనీల డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రూ.9కోట్ల 50లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత డ్రైనేజీ పైప్‌లైన్, ఇన్‌లెట్ ఔట్‌లెట్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, జలమండలి అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న అరికపూడి గాంధీ మాట్లాడుతూ.. ఈ శంకుస్థాపనతో కాలనీవాసులకు ఉపశమనం లభించిందని, ఎన్నేళ్లుగా వేధిస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కిందని తెలిపారు. కాలనీల్లో ప్రశాంతమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే తమ ధ్యేయమన్నారు. నల్లగండ్ల హుడా కాలనీ వద్ద రోజుకు 10 ఎం.ఎల్.డి సామర్థ్యంతో రూ.28కోట్ల అంచనా వ్యయంతో ఎస్.టి.పి (మురుగు నీటి శుద్ధి కేంద్రం) నిర్మించామని చెప్పారు. కాలనీల నుంచి వచ్చే మురుగు నీరు డ్రైనేజీ ఇన్‌లెట్ ద్వారా ఎస్.టి.పిలోకి చేరుతుందని వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ప్రాజెక్టుల విభాగం అధికారులు సీజీఎం పద్మజ, జీఎం వాస సత్యనారాయణ, డీజీఎం భార్గవి, జలమండలి జీఎం కృష్ణ, డీజీఎం నరేందర్, మేనేజర్ అభిషేక్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**మియాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషి నగర్, ప్రగతి ఎన్‌క్లేవ్, హెచ్.ఎం.టి స్వర్ణపురి కాలనీ, బి.కె.ఎన్‌క్లేవ్, న్యూ కాలనీ, మయూరి నగర్ కాలనీల్లో రూ.2కోట్ల 17లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. అలాగే పార్క్ ప్రారంభోత్సవంలో పీఏసీ ఛైర్మన్ అరికపూడి గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలి

**ముద్ర, కాప్రా :**



నగరంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ మల్కాజిగిరి వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. నాచారం, మల్లాపూర్ ప్రాంతాల్లో శానిటేషన్ తనిఖీల్లో భాగంగా జీహెచ్‌ఎంసీ శానిటేషన్ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటి చెత్త సేకరణ పరిస్థితులు, చెత్త అధికంగా పడే జీవీపీల వివరాలు, వాటి నిర్మూలనకు చేపడుతున్న చర్యలను అధికారులు సమీక్షించారు. ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ మసీదు ఎదురుగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, మైక్‌ల పనితీరును పరిశీలించారు. ఎస్‌ఎఫ్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటి చెత్త సేకరణ సర్వేలో భాగంగా గ్రీన్ హిల్స్ కాలనీలో ఇంటి యజమానులతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా స్వచ్ఛ ఆటోల అటెండెన్స్‌ను ప్రతిరోజూ పరిశీలించాలని, ప్రతి ఇంటికి తప్పనిసరిగా చెత్త సేకరణ వాహనం వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నగర పరిశుభ్రతను మరింత మెరుగుపరచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



# మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ తొలి విడత జాబితా విడుదల

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కోసం కాంగ్రెస్ తొలి విడత కార్పొరేటర్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఈ పార్టీ తరఫున కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు మొత్తం 216 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ నామినేషన్లలో తొలి విడతగా 36 మందిని ఖరారు చేస్తూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ వారికి బీ ఫారాలను అందజేశారు. ఇంకా 24మంది అభ్యర్థులకు బీ ఫారాలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉండటంతో, నామినేషన్లు వేసిన అభ్యర్థుల్లో బీఫారం వస్తుందా లేదా అన్న సందిగ్ధత నెలకొంది. మొత్తం 216 మంది అభ్యర్థులు టికెట్ల కోసం ఆశలు పెట్టుకున్నప్పటికీ, పార్టీ తరఫున 60మందిని మాత్రమే ఖరారు చేయాల్సి ఉండగా, అందులో తొలి విడతగా 36మందికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. పార్టీ విజయం కోసం ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఫారాలు రాని అభ్యర్థులు అసంతృప్తికి లోనుకావద్దని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల అన్ని వివరాలను పరిశీలించిన అనంతరమే బీ ఫారాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈసారి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మహిళల భద్రతకే ప్రాధాన్యత

- **మల్కాజిగిరి మహిళా భద్రత డీసీపీ ఉషారాణి**

**ముద్ర, మల్కాజిగిరి :**




మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని మల్కాజిగిరి కమిషనరేట్ మహిళా భద్రత డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉషారాణి తెలిపారు. ఎల్‌బీనగర్‌లోని సీపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్ సెషన్ నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. బాలికలు, మహిళలను వేధించే వారిని పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. మహిళలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, కూరగాయల మార్కెట్లు సహా ఇతర బహిరంగ ప్రదేశాల్లో షీ టీమ్స్ సాధారణ దుస్తుల్లో మోసపూరిత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలను వేధించిన వ్యక్తులను పక్కా ఆధారాలతో పట్టుకుని కోర్టుల ముందు హాజరుపరుస్తున్నామని, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ అందిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడిన మొత్తం 81 మంది నేరస్థులను (64 మంది మేజర్లు, 17 మంది మైనర్లు) షీ టీమ్స్ అరెస్టు చేశాయని తెలిపారు. అలాగే ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు మొత్తం 97 ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ షీ టీమ్స్ పి.వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ ఎం.ముని, అడ్మిన్ ఏస్ఐ రాజు, షీ టీమ్ సిబ్బంది, ప్రొఫెషనల్ కౌన్సెలర్లు పాల్గొన్నారు.

# ఏ.ఎస్. రావు నగర్ సమస్యల పరిష్కారానికి చర్యలు



- **ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హామీ**

**ముద్ర, కుషాయిగూడ :**

డా. ఏ.ఎస్. రావు నగర్ కాలనీకి చెందిన పలువురు స్థానికులు సోమవారం బీఆర్ఎస్ నాయకుడు సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. హుడా పార్క్ సమీపంలో ప్రజావసరాల కోసం శౌచాలయాల నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ద్వారా స్థలం కేటాయించాలని కోరారు. అలాగే డా. ఏ.ఎస్. రావు నగర్ ప్రవేశ ద్వారం-4 వద్ద పాదచారులు, వాహనాల కదలికకు అనుకూలంగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రవేశ ద్వారం3 జంక్షన్ వద్ద అన్ని వైపులా జీబ్రా లైన్లు, స్టాప్ లైన్లు మార్కింగ్ చేయించాలని కోరారు. ఈ అంశాలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారు. మొదటి సమస్యకు సంబంధించిన అంశంపై వెంటనే డిప్యూటీ కమిషనర్‌కు ఫోన్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన సమస్యలపై సంబంధిత అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. కాలనీ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి, సమావేశాన్ని సమన్వయం చేసిన సోమశేఖర్ రెడ్డికి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యమైన ఆహార భద్రతా నియమాలను పాటించాలి

- **అదనపు కలెక్టర్ రాజేశ్వరి**

**ముద్ర, వికారాబాద్ బ్యూరో :**

ప్రజలందరికీ నాణ్యమైన, సురక్షిత ఆహారం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ రాజేశ్వరి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశ్వరి, సుధీర్‌లు ఆహార భద్రత అంశాలపై విస్తృతంగా చర్చించి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహాలు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడంతో పాటు ఆహార భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అంగన్వాడీలు, పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వసతి గృహాల్లో సరఫరా చేస్తున్న భోజనంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని హోటళ్లు అన్నీ తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భోజన నమూనాలను సేకరించి వాటి నాణ్యతను పరిశీలించాలని సూచించారు. నాణ్యమైన ఆహారం మాత్రమే కాకుండా భోజనం తయారు చేసే పరిసరాలు కూడా పారిశుధ్యంగా ఉండేలా ఆహార భద్రత అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిపిఓ జయసుధ, డిఇఓ రేణుకాదేవి, డిడబ్ల్యుఓ కృష్ణవేణి, డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, ఆహార భద్రత అధికారి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**

**గోల్కొండ కోట (తెలంగాణ)**



అద్భుతమైన శబ్ద నైపుణ్యం.. కట్టడా లకు ఈ కోట పెట్టింది పేరు. సాయంత్రం వేళ ఇక్కడ జరిగే 'లైట్ అండ్ సౌండ్ షో' చరిత్రను కళ్లకు కడుతుంది.

# 'పుర'పోరు తర్వాత ఇంటిపన్ను పెంపు

**- మోసానికి కాంగ్రెస్ రెడీ - బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లే - కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్**



**ముద్ర, కరీంనగర్ :**

మున్సిపల్ ఎన్నికలు అయిపోగానే ఇంటి పన్ను పెంపునకు కాంగ్రెస్ ప్లాన్ చేస్తోందని కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. రెండేళ్లలో మున్సిపాలిటీలు, కరీంనగర్ కార్పొరేషన్‌కు నయాపైసా విడుదల చేయలేదని మండిపడ్డారు. కరీంనగర్ పట్టణంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్లే అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఉపయోగం లేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, కబ్జాలతో దోచుకుతిన్నారని ఆరోపించారు. పొరపాటున బీఆర్ఎస్ గెలిస్తే.. కమీషన్ల కోసం కేంద్ర నిధులను దారి మళ్లిస్తుందని అన్నారు. కరీంనగర్‌లో జరిగిన అభివృద్ధి మొత్తం కేంద్రం నిధులతోనే అని చెప్పారు. తాను పైసలు తీసుకొస్తే.. బీఆర్ఎస్ నేతలు సిగ్గులేకుండా కొబ్బరికాయ కొట్టి మావేనని చెప్పుకున్నారని ఆరోపించారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే మరిన్ని నిధులు తెచ్చే బాధ్యత తనదన్నారు. గంగుల కమలాకర్ కు మూట ముల్లె సర్దుకుని కరీంనగర్ వదిలి వెళ్లిపోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



# బి.ఫాం ఇచ్చిన అభ్యర్థులకు సహకరించి గెలిపించండి

**- రెబల్ గా పోటీ చేసినవాళ్లను 15 ఏళ్లపాటు పార్టీ నుండి సస్పెండ్ - బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు వెల్లడి**

**ముద్ర, హైదరాబాద్:**

మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి బి.ఫాం ఇచ్చిన వాళ్లు మాత్రమే ఎన్నికల బరిలో ఉండాలని, నామినేషన్లు వేసిన మిగిలిన బీజేపీ నాయకులంతా పార్టీ శ్రేయస్సు కోసం తక్షణమే నామినేషన్లను ఉపసంహరించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ''అనేక సర్వే నివేదికల ఆధారంగా, సామాజిక పరమైన అంశాలతో మరియు పార్టీ ప్రత్యేక అంశాలతో గెలిచే అవకాశాలు ఉన్నాయన్న అభ్యర్థులకే పార్టీలోని ముఖ్యమైన వారు సామూహికంగా కలిసి టిక్కెట్లు ఖరారు చేయడం జరిగింది. టిక్కెట్ రానివాళ్లు బాధపడడం సహజం. గత అనేక సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసం గెలుపు కోసం పనిచేస్తున్న కార్యకర్తలు వారిని పార్టీ గుర్తుంచుకుంటుంది. పార్టీ కార్యకర్తల కృషి, బిజెపి పట్ల ప్రజలకున్న విశ్వాసంతోనే గ్రామ పంచాయతీ ఎన్నికలలో పార్టీ ఘనవిజయాలను సాధించింది. ఈ మున్సిపల్ ఎన్నికల్లో కూడా కార్యకర్తల కృషితో ప్రజల మద్దతుతోనే పార్టీ మున్సిపల్ ఎన్నికలలో విజయ పరంపర కొనసాగిస్తుందన్న విశ్వాసం రాష్ట్ర పార్టీకి పూర్తిగా ఉంది. వెంటనే నామినేషన్లను ఉపసంహరించుకుని వారి డివిజన్లు, వార్డుల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలి'' అని కోరారు.

పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా రెబల్ అభ్యర్థులుగా పోటీ చేస్తే మాత్రం పార్టీ రాష్ట్ర నాయకత్వం సీరియస్ గా పరిగణిస్తుందని తెలిపారు. ఎవరైనా నామినేషన్లను ఉపసంహరించుకోకుండా ఇండిపెండెంట్ గా పోటీ చేయాలనుకునేవాళ్లను 15 ఏళ్ల పాటు పార్టీ నుండి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులోనూ అలాంటి వారిని తిరిగి బీజేపీలో చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

**కరీంనగర్ బరిలో బీజేపీ అభ్యర్థులు**

**- 66 వార్డులకు జాబితా విడుదల**

హైదరాబాద్/కరీంనగర్: కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ తమ అభ్యర్థుల జాబితాను ఖరారు చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆదేశాల మేరకు 66 వార్డులకు గాను తొలి విడతలో కీలక అభ్యర్థుల పేర్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు సోమవారం అధికారికంగా ప్రకటించారు. బీజేపీ అభ్యర్థులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆమోదించారు.

1 వార్డు BC-మహిళా, బారి అపర్ణ
2 వార్డు జనరల్, కొలగాని శ్రీనివాస్
3 వార్డు జనరల్-మహిళా, సాధినేని లావణ్య
4 వార్డు SC-జనరల్, భూపతి రవీందర్
5 వార్డు BC-మహిళా, చిందం హారిక
6 వార్డు జనరల్, మేకల వెంకటేష్
7 వార్డు జనరల్-మహిళా, వాడే రమాదేవి
8 వార్డు జనరల్, తోర్తి సంతోష్
9 వార్డు జనరల్-మహిళా, బండారి గాయత్రీ దేవి
10 వార్డు BC-జనరల్,దేశవేణి శంకర్
11 వార్డు జనరల్-మహిళా, పండుగ స్వప్న
12 వార్డు జనరల్-మహిళా,చొప్పరి జయశ్రీ
13 వార్డు జనరల్-మహిళా,రెడ్డవేన లావణ్య
14 వార్డు BC-జనరల్,గుంజేటి శివ కుమార్
15 వార్డు జనరల్-మహిళా,సోమిరెడ్డి కరుణ
16 వార్డు జనరల్, గీత రాజేంద్ర ప్రసాద్
17, వార్డు BC-మహిళా, గుంటి రమ్య
18 వార్డు జనరల్, వసాల రమేష్
19 వార్డు జనరల్-మహిళా, మూల రుక్మిణి
20 వార్డు SC-జనరల్,జాడి బాల్రెడ్డి
21 వార్డు జనరల్,కొండపల్లి సతీష్
22 వార్డు జనరల్,బండ రమణారెడ్డి
23 వార్డు జనరల్,పదం శివరాజ్
24 వార్డు జనరల్, వొంతెల సత్యనారాయణ రెడ్డి
25 వార్డు SC-జనరల్,కటకం లోకేష్
26 వార్డు జనరల్,పుల్లెల పవన్ కుమార్
27 వార్డు SC-మహిళా,తంబాల నవ్యశ్రీ
28 వార్డు ST-జనరల్,కుర్ర రాజేశం
29 వార్డు SC-జనరల్,సోమిడి వేణు
30 వార్డు SC-మహిళా,నక్క సరిత సుభాషిణి
31 వార్డు BC-జనరల్, మహమ్మద్ ఫయాజుద్దీన్
32 వార్డు BC-జనరల్,మహమ్మద్ ఇనాయత్ అలీ
33 వార్డు BC-మహిళా,మాడిశెట్టి సరిత
34 వార్డు BC-జనరల్,ఎలగందుల నంద కుమార్
35 వార్డు BC-మహిళా,సదావేణి సుజాత
36 వార్డు BC-జనరల్,తోట అనిల్
37 వార్డు BC-జనరల్,కోదూరి ఏ.పి.పి చంద్ర
38 వార్డు జనరల్-మహిళా,దేవసాని సరస్వతి
39 వార్డు BC-జనరల్,పసుపులేటి శివానందం
40 వార్డు జనరల్-మహిళా,కాసర్ల లక్ష్మి నరసవ్వ
41 వార్డు జనరల్-మహిళా,వెనంక రేణుక
42 వార్డు జనరల్,యాదగిరి సుని రావు
43 వార్డు BC-మహిళా,పొన్నం లక్ష్మి
44 వార్డు జనరల్-మహిళా,బండి తార
45 వార్డు BC-మహిళా,గడప విజయలక్ష్మి
46 వార్డు BC-జనరల్,కోడూరి అఖిల్ గౌడ్
47 వార్డు BC-మహిళా,గజ రామ
48 వార్డు BC-మహిళా,కర్ర పద్మ
49 వార్డు జనరల్-మహిళా,అన్నం లక్ష్మి
50 వార్డు జనరల్,బొయినపల్లి ప్రవీణ్ రావు
51 వార్డు జనరల్,బండారి వేణు
52 వార్డు జనరల్-మహిళా,నెదునూరి కనకలక్ష్మి2
53 వార్డు SC-మహిళా,కొంపెల్లి శ్వేత
54 వార్డు BC-మహిళా,గొట్టెముకుల ఉమారాణి
55 వార్డు జనరల్-మహిళా,గుగ్గిళ్లపు మంజుల
56 వార్డు జనరల్-మహిళా,తటి ప్రభావతి
57 వార్డు జనరల్-మహిళా,కొలిపాక రమ్యశ్రీ
58 వార్డు BC-జనరల్,సర్దార్ బల్బీర్ సింగ్
59 వార్డు BC-జనరల్,మహమ్మద్ సమీ పర్వేజ్
60 వార్డు జనరల్-మహిళా,టి. శ్రీదేవి
61 వార్డు BC-జనరల్,సయ్యద్ రిజ్వానా
62 వార్డు BC-మహిళా,పెద్దపల్లి శ్రీలేఖ
63 వార్డు BC-జనరల్,దేశ శిల్ప
64 వార్డు BC-మహిళా,గాదె శ్రీకళ
65 వార్డు జనరల్,కామటం తిరుపతి
66 వార్డు జనరల్,వంగల పవన్

## ఆభరణాలు శుద్ధి చేస్తామంటూ మోసం

**- ఒకరి పట్టివేత,**
**పారిపోయిన మరో వ్యక్తి**

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లి, మొగిలిపాలెం గ్రామాల్లో సోమవారం ఉదయం గుర్తు తెలియనీ ఇద్దరు వ్యక్తులు తిరుగుతూ బంగారు, వెండి ఆభరణాలు శుద్ధి చేస్తామంటూ నమ్మబలికారు. ఓ మహిళ ఆభరణాలను ఇవ్వగా వారి వద్ద ఉన్న ఒక కెమికల్ లో వాటిని వేసి శుద్ధి చేశామంటూ మహిళలకు తిరిగి ఇచ్చి వెళ్లిపోయారు. ఆభరణాలు చిన్నగా అనిపించడంతో అనుమానం వచ్చిన వారు గ్రామస్తులకు చెప్పడంతో ఇద్దరు దుండగల కోసం గాలించారు. మొగిలిపాలెం గ్రామ శివారులో గ్రామస్తులు ఒకరిని పట్టుకోగా.. మరొకరు తప్పించుకొని పారిపోయాడు. నిందితుడిని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించగా పోలీసులు ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో రైతులకు అధిక లాభాలు

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ముద్ర, ఆదిలాబాద్:**

జిల్లాలోని రైతులు రసాయన ఎరువులు, పురుగుల మందులకు స్వస్తి పలికి, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, వ్యవసాయ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'ప్రకృతి వ్యవసాయంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని' ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.




ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన 20 క్లస్టర్లలోని 2,500 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా, పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కూడా రసాయన వ్యవసాయం కంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలే తట్టుకొని నిలబడతాయని ఆయన ఉదాహరణలతో వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం నుండి ఎకరాకు ఏడాదికి 4,000 రూపాయల చొప్పున ప్రోత్సాహకం అందుతుందని, అలాగే మహిళా సంఘాల ద్వారా బయో ఇన్ పుట్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటుకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో క్లాసులతో పాటు క్షేత్రస్థాయి సందర్శనలు కూడా ఉంటాయని, శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు గ్రామాల్లోని రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ బ్రోచర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు కళాశాల ప్రాంగణంలో పండిస్తున్న ఉద్యాన పంటల సాగును కలెక్టర్ పరిశీలించగా, సాగు వివరాలు, స్ప్రింక్లర్ల పనీ తీరును ఉద్యానవన పంటల శాస్త్రవేత్త మల్లేష్ కలెక్టర్ కు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్ రాథోడ్, జిల్లా పశు వైద్యశాల అధికారి రామారావు, ఆత్మ పిడి రామ్ కిషన్, ఏవో శివకుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీధర్, రఘువీర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రభావతి, రైతులు, ఇతర అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ గెలుపుతో రాష్ట్ర రాజకీయాల్లో మార్పు ఖాయం

**- ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటే, ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని శ్వేత హోటల్ లో బిఆర్ఎస్ 66 డివిజన్ల ఇన్చార్జులతో నిర్వహించిన కీలక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తో కలిసి ఇన్చార్జులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, బిఆర్ఎస్ పాలనలోనే కరీంనగర్ నగరంలో 90 శాతం రోడ్ల పనులు పూర్తయ్యాయని, ఎన్నో అభివృద్ధి ప్రాజెక్టులను తీసుకువచ్చామని గుర్తు చేశారు. గత రెండేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కరీంనగర్ కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. అభివృద్ధిని గుర్తించి ప్రజలు మళ్లీ బిఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎవరితో పొత్తు లేకుండానే మేయర్ పీఠాన్ని దక్కించుకున్న చరిత్ర బిఆర్ఎస్ ది అని, ఇప్పుడు కూడా అదే పునరావృతం అవుతుందని గంగుల స్పష్టం చేశారు. ఇప్పటికే 60 మంది అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేశామని, ప్రతిపక్ష పార్టీల్లో టికెట్ల కోసం కొట్లాటలు జరుగుతుంటే, తమ పార్టీలో క్రమశిక్షణతో అభ్యర్థుల ఎంపిక జరిగిందని ఎద్దేవా చేశారు. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు తోడుగా ఉన్న వారిని బిఆర్ఎస్ ఎప్పుడూ కడుపులో పెట్టుకొని చూసుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ కు ప్రత్యేక చరిత్ర ఉందని, ఇక్కడి నుండే ఉద్యమం మొదలై రాష్ట్రం సిద్ధించిందని వినోద్ కుమార్ గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ తదితర నేతలు పాల్గొన్నారు.

## గంగుల.. మూట ముల్లె సర్దుకుని వెళ్లిపో..

**- ఇదిగో నేను తెచ్చిన నిధుల వివరాలు.. ఇంటింటికీ పంపుతున్నా..**
**- కరీంనగర్ కోసం కొట్లాడి జైలుకు పోయినోడిని**
**- ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయండి**
**- కరీంనగర్ ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు...**



**ముద్ర, కరీంనగర్:**

"నేను కరీంనగర్ అభివృద్ధికి ఒక్క పైసా తీసుకురాలేదని అబద్ధాలు ఆడుతున్న గంగుల కమలాకర్.. ఇదిగో సాక్ష్యాలు! నువ్వు అన్న మాట ప్రకారం ఇప్పుడు మూట ముల్లె సర్దుకుని వెళ్ళిపోతావా?" అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిప్పులు చెరిగారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కిసాన్ నగర్, కాపువాడల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగులకు జనం భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి తాను తీసుకొచ్చిన వందల కోట్ల నిధులు, చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన ప్రత్యేక బుక్ లెట్ ను బండి సంజయ్ బహిరంగంగా ప్రదర్శించారు.

"5 లక్షల పుస్తకాలను ముద్రించాను, ఇంటింటికీ పంపిస్తున్నాను. నిధులు నిరూపిస్తే నగరాన్ని వదిలి వెళ్తా అన్న గంగుల.. ఇప్పుడైనా తన మాట మీద నిలబడాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్, బీఆర్ఎస్ లపై విమర్శల వర్షం**

ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ కు ఓట్లు అడిగే హక్కు లేదని మండిపడ్డారు. కార్పొరేషన్ కు నయాపైసా ఇవ్వని ఆ పార్టీ నేతలను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ కేవలం కబ్జాలు, అవినీతికే పరిమితమైందని విమర్శించారు. బీఆర్ఎస్ కు ఓటు వేయడం అంటే మురికి కాలువలో వేయడమేనని ఎద్దేవా చేశారు.

**మేయర్ పీఠం ఇస్తే నగరాన్ని మారుస్తా..**

తాను కాపువాడ బిడ్డనని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని సంజయ్ పేర్కొన్నారు. "బిజెపి అభ్యర్థులను గెలిపించి, కార్పొరేషన్ పీఠాన్ని మాకు అప్పగించండి.. మీ కార్పొరేటర్లను స్వయంగా మోదీ దగ్గరికి తీసుకెళ్లి వేల కోట్లు తీసుకొచ్చి కరీంనగర్ రూపురేఖలు మారుస్తాను" అని భరోసా ఇచ్చారు.

సభల అనంతరం బీజేపీ అభ్యర్థులతో బండి సంజయ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ మనోహర్ రెడ్డితో పాటు స్థానిక డివిజన్ల అభ్యర్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**

శ్రీశైలం (ఆంధ్రప్రదేశ్): ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన మల్లికార్జున స్వామి ఆలయం ఇక్కడ ఉంది. కృష్ణా నది ఒడ్డున దట్టమైన నల్లమల అడవుల మధ్య ఈ క్షేత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.





## సమ్మెను జయప్రదం చేయండి

**ముద్ర, నడిగూడెం:**

ఫిబ్రవరి 12న జరగబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని నడిగూడెం మండల కన్వీనర్ మల్లెల వెంకన్న కార్మిక వర్గాన్ని కోరారు. నడిగూడెం మండల కేంద్రంలో సోమవారం జరిగిన సమావేశం లో రైతు సంఘం నాయకులు బెల్లంకొండ సత్యనారాయణ మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పదోసారి ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ లో కార్మికుల సంక్షేమం కోసం ఒక రూపాయి కూడా కేటాయించలేదని తమ శ్రమ ద్వారా ఉత్పత్తిని సాధించి దాని ద్వారా ప్రభుత్వాలకు ఆదాయం తీసుకొచ్చే కార్మిక వర్గానికి బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గం అన్నారు. ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కేంద్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ కార్మికులు షేక్ జాని, మామిడి తిరపయ్య ,పేరయ్య ఎలుగూరి వెంకన్న, దున్న రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలే ఎజెండా..

- పరిష్కారం దిశగా అడుగులు
- పదవి లేకున్నా పనులు
- గెలిపిస్తే మరింత చేరువ
- ఈతరం శ్రీమంతుడు నల్లెల్ల కుమార్

**ముద్ర, పరకాల:**



ప్రజా సమస్యల పరిష్కారమే అతని ఎజెండా.. ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా.. అక్కడ ఉండే వ్యక్తి ఆయన.. తన సొంత నిధులతోనే అనేక పనులు చేసిన ప్రజా నాయకుడతడు.. ఎన్నో ప్రజా ఆమోదయోగ్యమైన పనులు చేసి నల్లెల్ల కుమార్ మన్ననలు పొందుతున్నారు.

జనం శ్రీమంతుడిని రీల్స్ లో చూసి ఉండవచ్చు... కానీ పరకాల మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామమైన సీతారాంపురం గ్రామంలో నిజమైన శ్రీమంతుడిని చూసినట్టుగా జనం భావిస్తారు. ఆ గ్రామంలోని నల్లెల్ల కుమార్ నిజ జీవితంలో శ్రీమంతుడి వలె మారి ప్రజలకు అవసరమైన పనులను చేస్తూ ప్రజల మెప్పును పొందుతున్నారు. ఎలాంటి పదవి ఆశించకుండానే గ్రామంలో పోచమ్మ మైసమ్మ ఆంజనేయస్వామి లాంటి దేవాలయాల నిర్మాణం తో పాటు ప్రజలకు అవసరమైన రోడ్లు కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు చేసి ప్రజల మనసుల్లో చోటు సంపాదించుకున్నారు. గీత కార్మికులకు వ్యవసాయదారులకు కూలీలకు అవసరమైన విధంగా రహదారుల నిర్మాణం చేపట్టి గ్రామంలోనీ ప్రజల మన్ననలను పొందారు. ఈయన ప్రస్తుతం విలీన గ్రామమైన సీతారాంపురం పరిధిలోని ఎనిమిదో వార్డు కౌన్సిలర్గా పోటీ చేస్తుండడం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి పదవిని లేకున్నప్పటికీ ప్రజల సేవలను అవసరాలను గుర్తించిన ఆయన ప్రజాప్రతినిధిగా అవతారం ఎత్తితే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటుగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటాడని ప్రజలు భావిస్తున్నట్లు తెలిసింది. ఆయన ను ప్రజాపక్షం పలకరించగా తనను ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ గా సీతారాంపురం గ్రామ ప్రజలు గెలిపించినట్లయితే ఈ వార్డును స్థానిక శాసనసభ్యుడు నిద్రతోపాటు తన సొంత నిధులను తో వార్డును మరింత అభివృద్ధి చేసి ప్రజల హృదయాలలో చోటు సంపాదించుకుంటానని నల్లెల్ల కుమార్ తెలిపారు. తనపై నమ్మకంతో ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారని ఆయన సంపూర్ణ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజల అవసరాలను గుర్తించి పని చేస్తున్న సమయంలో కొన్ని పార్టీలు తనపై అనేక రకాలైన వేధింపులకు పాల్పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరకాల శాసనసభ్యుడు ప్రకాష్ రెడ్డి గ్రామంలో తన చేస్తున్న సేవలను గుర్తించి పిలిచి తనకు టికెట్ కేటాయించారని నల్లెల్ల కుమార్ తెలిపారు.

## కాంగ్రెస్ లో కానరాని ఐక్యత

- గెలుపు ఓటమిలపై ప్రభావం పడే అవకాశం

**ముద్ర, పరకాల:**



చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం అని కాంగ్రెస్ పార్టీలో అనుభవజ్ఞులైన నాయకులు కార్యకర్తలు అంటున్నారు. కొద్ది రోజుల్లో జరగనున్న పరకాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ తీరాలకు చేరాలంటే పార్టీలోని అందరు నాయకులను కలుపుకొని ముందుకు సాగాలని కోరుతున్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని పార్టీ అభిమానులు గుసగుసలాడుతున్నారు. గతంలో పరకాల నియోజకవర్గ ఇన్చార్జిగా పనిచేసిన ఇనుగాల వెంకటరామిరెడ్డికి పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులతోనూ కార్యకర్తలతోనూ పరిచయాలు ఉన్నాయి. ఆయన ఒక పర్యాయం పరకాల నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిని పొందారు. ఆయన ప్రస్తుతం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన విషయం తెలిసిందే. అదేవిధంగా పిసిసి ఉపాధ్యక్షుడిగా కొనసాగిన పరకాల మండలానికి చెందిన దొమ్మాటి సాంబయ్య కు పరకాల పట్టణంలోని దళిత, బీసీ నాయకులతో సంబంధాలు ఉన్నాయి. మొన్నటి పంచాయతీ ఎన్నికలలోనూ కొద్ది రోజుల్లో జరిగే పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో వీళ్ళ ప్రమేయం లేకపోవడంపై కార్యకర్తలో నాయకులో తీవ్రమైన అయోమయం నెలకొంది. రెండు సంవత్సరాల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు పరకాల నియోజకవర్గ ఇన్ చార్జ్ గా ఆత్మకూరు మండలానికి చెందిన ఇనుగాల వెంకటరామిరెడ్డి కొనసాగారు. దాంతో ఆయనకు పరకాల నియోజకవర్గం పైన నియోజకవర్గ కేంద్రమైన పరకాల పైన పూర్తిస్థాయిలో అవగాహనతో పాటు కార్యకర్తలపైనా, నాయకుల్లోనూ పట్టు ఉందని పార్టీలోని కొందరు నాయకులు అనుకుంటున్నారు. వీళ్ళ సేవలను పార్టీ నాయకత్వం స్థానిక ఎమ్మెల్యే అందుబాటులో తీసుకుంటే మెరుగైన ఫలితాలు రావచ్చని పార్టీ నాయకుల అభిప్రాయపడుతున్నారు.

**కాంగ్రెస్ లో కనబడిని ఐక్యత..**

కాంగ్రెస్లో ఐక్యత ఎండమావిగా మారిందని పార్టీ నాయకులు అంటున్నారు. కొద్ది రోజుల్లో జరగనున్న పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో 22 మంది అభ్యర్థుల్లో విజయం సాధించాలంటే పార్టీ నాయకులు ఐక్యంగా కలిసి పని చేయాలని కోరుతున్నారు. ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించినట్లయితే కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ ఎన్నికలలో బొక్క బోర్లా పడటం ఖాయమని కొందరు నాయకులు బాహాటంగా అంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్ని స్థాయిలలో గల కాంగ్రెస్ పార్టీలోని నాయకులను కార్యకర్తలను సమన్వయ పరిచి ముందుకు నడిపించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. ఇప్పటివరకు అలాంటి ప్రయత్నాలు జరగలేదని, వెంటనే ఆ ప్రయత్నాలను వేగిరియం చేసి పార్టీ అభ్యర్థులకు గెలుపుకు కృషి చేయాలని కాంగ్రెస్ లోని మెజారిటీ నాయకులు కార్యకర్తలు కోరుతున్నారు.



## బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

భువనగిరి మున్సిపల్ ఎన్నికలలోబిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం 26 వ వార్డ్ లో ఇంటింటి ప్రచారం నిర్వహించి అభ్యర్థి చీమల రాజుని గెలిపించాలని వార్డ్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు ఆబోతుల కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, వార్డ్ ఇంచార్జి సురేపల్లి రమేష్, కంచనపల్లి నర్సింగ్ రావు, సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టుపల్లి అనురాధ, కార్యదర్శి మాయ కృష్ణ, వార్డ్ అధ్యక్షుడు దండు కృష్ణ, గంధమల్ల మాతయ్య, దండు గిరి, కార్యకర్తలు, వార్డ్ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధికి ఉరి తీసిన మోడీ ప్రభుత్వం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల, గ్రామీణ ధనిక వర్గాల ప్రయోజనాల కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ఉరి వేసిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా విమర్శించారు. సోమవారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో జి రామ్ జి చట్టాన్ని రద్దుచేసి, మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ ఉపాధి హామీ కార్మికులతో కలిసి "నిరసన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు వారి జీవన హక్కులను బలోపేతం చేయడానికి వామపక్ష పార్టీల ఒత్తిడి మేరకు 2005లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యూపీఏ వన్ ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ద్వారా కోట్లాదిమంది కూలీలకు స్వ గ్రామంలోని ఉపాధి లభించిందని ఆకలి బాధలు, వలసలు తగ్గాయని ప్రజలకు కొనుగోలు శక్తి పెరిగిందని, మహిళల ఆర్థిక గౌరవాన్ని బలోపేతం చేసిందని అన్నారు. 2008లో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం వచ్చినప్పటికీ దాని ప్రభావం గ్రామీణ భారతంపై పెద్దగా పడలేదని కరువుల్లోనూ, కరోనా సమయంలోను గ్రామీణ ప్రజలను ఉపాధి హామీ చట్టము ఆదుకుందని తెలిపారు. అలాంటి చట్టానికి మోడీ సర్కారు 10 ఏళ్లుగా తూట్లు పొడుస్తూ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్రలో భాగంగా జి రామ్ జి చట్టాన్ని తెచ్చారని అన్నారు. 40 శాతం నిధులు రాష్ట్రాలు భరించాలని నిబంధన మోడీ సర్కార్ తీసుకొచ్చిందని, 40 శాతం రాష్ట్రాలు ఖర్చు పెడితేనే 60% నిధులు కేంద్రం బరిస్తుందని మెలిక పెట్టానని విమర్శించారు. 125 రోజులకు ఉపాధి పనిని పెంచామని చెప్తున్న మోడీ ప్రభుత్వం దీనిని అమలు చేయాలంటే బడ్జెట్లో రూ.3 లక్షల కోట్లు కేటాయించవలసి ఉండగా కేవలం రూ. 95 వేల కోట్లకే పరిమితం చేసిందని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 ను కొనసాగించాలని నర్సింహ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా, మండల అధ్యక్షులు బొల్లెపల్లి కిషన్, మండల నాయకులు ఏదునూరు వెంకటేష్, కడారి కృష్ణ, మైలారం శివ, ఎండి. రఫీక్, తూముకుంట వెంకటేష్, పన్నాల నరేందర్ రెడ్డి, బొల్లెపల్లి రమ్య, బొల్లెపల్లి సోనీ, బొల్లెపల్లి కల్పన, బొల్లెపల్లి అనిత, జనగాం సుమలత, ఏదునూరి సోనీ, మావురం భారతమ్మ, గోసన విజయ పాల్గొన్నారు.



## వికలాంగులకు అన్యాయం

- బడ్జెట్ లో అరకొర నిధులు
- ఎన్ పిఆర్ డీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల దహనం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో వికలాంగులకు తీరని అన్యాయం చేసిందని ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి సురూపంగా ప్రకాష్, వనం ఉపేందర్ ఆరోపించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికలాంగుల హక్కులను ఉల్లంఘించే విదంగా ఉందని, అసమానతను పెంపొందిస్తుందని వికలాంగుల వారు పేర్కొన్నారు. వికలాంగుల హక్కుల చట్టం, 2016 ప్రకారం, భారత రాష్ట్రం చట్టబద్ధంగా సమానత్వం, వివక్షత లేని, వికలాంగుల పూర్తి భాగస్వామ్యాన్ని నిర్ధారించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ చట్టం సమ్మిళిత విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, సామాజిక భద్రత, అందుబాటులో ఉన్న గృహనిర్మాణం, రవాణా మరియు ప్రజా సేవల హక్కులకు హామీ ఇస్తుందని అయినప్పటికీ ఈ బడ్జెట్‌లోని నిబంధనలు ఈ చట్టబద్ధమైన హక్కులను వాస్తవికతలోకి అనువదించడంలో ఎటువంటి తీవ్రతను చూపించవని అన్నారు. వికలాంగుల సాధికారత శాఖకు మొత్తం కేటాయింపులలో స్వల్ప పెరుగుదల ఉన్నప్పటికీ, ఈ పెరుగుదల ప్రధానంగా ప్రకటించిన రెండు కొత్త పథకాలకు వెళుతుందన్నారు. మొత్తం బడ్జెట్ కేటాయింపులలో కేటాయింపులు 0.0286 శాతం మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.పి.ఆర్.డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, ఏ.గోపి, శ్రీహరి, అంజన్ శ్రీ, మధు పాల్గొన్నారు.





## అంగరంగ వైభవంగా శ్రీవారి కళ్యాణం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

పట్టణంలోని రాయగిరిలో స్వయంభు శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా ఆదివారం రాత్రి జరిగింది. ఈ మహోత్సవం కార్యక్రమంలో యాదగిరిగుట్ట దేవస్థానం నుండి పట్టు వస్త్రాలు స్వామి వాళ్లకు సమర్పించారు. యాదగిరిగుట్ట దేవాలయ అర్చకులు స్వామివారి కళ్యాణం జరిపారు. కళ్యాణంలో లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య. కళ్లెం బాల నరసింహ గౌడ్, కాయతి వెంకట్ రెడ్డి, పాల్త్య హనుమాన్, ఆకుల నరసింహారావు, దవ్వూరి అనంతప్ప, మల్లేష్ భక్తులు పాల్గొన్నారు.







## గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

**ముద్ర, తుర్కపల్లి :**

తుర్కపల్లి మండలంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులనుర పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ తన సిబ్బందితో కలిసి గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఓ కారులో (AP29N5878) గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కొండమడుగు -బీబీనగర్ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి తుర్కపల్లి వైపు తీసుకువస్తున్నట్లు వెల్లడైంది. తేర్యాల గ్రామం, మోటకొండూర్ మండలం తేర్యాల గ్రామానికి చెందిన చామల అఖిల్ రెడ్డి , గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన మజోజు ప్రశాంత్ లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. ఈ కేసు విచారణ జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్, డీఎస్పీ పి. శ్రీనివాస్ నాయుడు, యాదగిరిగుట్ట రూరల్ సీఐ ఎం. శంకర్ పర్యవేక్షణలో కొనసాగుతోంది.

## బడ్జెట్ లో తెలంగాణకు అన్యాయం

- తుంగతుర్తి మాజీ ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య

**ముద్ర, తుంగతుర్తి :**



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి కావలసిన నిధులు కేటాయించడంలో పూర్తిగా పక్షపాత వైఖరి అవలంబించిందని మాజీ ఎంపీపీ టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం మిగతా రాష్ట్రాలకు వేరొక న్యాయం పాటించి పక్షపాత వైఖరి అవలంబించింది అన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వంలో టీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని అన్నారు. రాష్ట్రం లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర నిధులు రాబట్టడం లో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. తిరిగి రాష్ట్రం లో కెసిఆర్ ప్రభుత్వం తెచ్చే విధంగా ప్రజలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం లో జిల్లానాయకులు గుండగాని రాములుగౌడ్. మండల నాయకులు తునికి సాయిలు గౌడ్. గోపగాని రమేష్ గౌడ్. చింతకుంట్ల భాస్కర్ గోపగాని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వర్ణ గిరీషుడి తిరువీధి ఉత్సవం

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్య కళ్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రతిరోజు స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్న ప్రసాద వితరణలో భాగంగా సుమారు 3000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.



## రామారావుకు గోపుత్ర ఉత్తమ రైతు పురస్కారం

**ముద్ర, నడిగూడెం:**

రత్నవరం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కన్నెబోయిన రామారావు, పల్లి సంజీవరెడ్డి కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా పర్చూరు లో మంగళవారం అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో గోపుత్ర ఉత్తమ రైతు పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ చైర్మన్ పెండెగంటి విజయ్ కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు రంజాన్ రమేష్, కుడుముల వెంకటరామి రెడ్డి, టి. నాగరాజు, డాక్టర్ చల్ల నాగేశ్వరావు, బీ ఆర్ సోమ శేఖర్ రెడ్డి, కిసాన్ సేవా రత్న డాక్టర్ మొలుగూరి గోపయ్య పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
03.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**
రామోజీ ఫిల్మ్ సిటీ (తెలంగాణ): ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సినిమా షూటింగ్ కాంప్లెక్స్. ఇక్కడి విభిన్న సెట్టింగ్‌లు, గార్డెన్‌లు, వినోద కార్యక్రమాలు కుటుంబంతో గడపడానికి ఉత్తమమైన ప్రదేశం.





# ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- సిద్దిపేట మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**
అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి విమర్శించారు. సోమవారం పట్టణంలోని 7వ వార్డ్ లో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాని పాలనలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో రైతు భరోసా కింద ఒక్కో రైతుకు ఇప్పటివరకు రెండు లక్షల రూపాయలు బాకీ పడిందన్నారు. వరి పంటకు బోనస్ కింద ఎకరాకు 12,500 రూపాయల చొప్పున ఇప్పటివరకు 50వేల రూపాయలు బాకీ పడిందని గుర్తు చేశారు. యువకులకు నిరుద్యోగ భృతి కింద 24 నెలలకు 96 వేల రూపాయలు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేల రూపాయలు చొప్పున రూ.24,000, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున 24 నెలలకు రూ.62 వేల500 బాకీ పడిందన్నారు.వృద్ధులకు, బీడీ కార్మికులకు నెలకు 4000 రూపాయల పెన్షన్ హామీతో 24 నెలల్లో 50 వేల రూపాయలు, దివ్యాంగులకు నెలకు రూ. ఆరు వేల చొప్పున 24 నెలలకు 50 వేల రూపాయలు బాకీ పడిందన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆడబిడ్డల పెళ్లిలకు ఒక్కో పెళ్లికి తులం బంగారం చొప్పున, విద్యార్థులకు స్కూటీ ఇస్తానన్న ఎన్నికల హామీ ఇప్పటికి పత్తా లేకుండా పోయిందని దుయ్యబట్టారు. ఎనిమిది వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో లక్షలాది మంది విద్యార్థుల చదువు నేడు రాష్ట్రంలో ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అనేకమంది బడుగు, బలహీన వర్గాలు, నిరుపేద విద్యార్థులు రీయింబర్స్ మెంట్ రాక ఉన్నత చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఒక్కో కూలికి ఇప్పటి వరకు రూ. 24 వేల బాకీ పడిందని పేర్కొన్నారు. హామీలను మరిచిన కాంగ్రెస్ కు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో 7 వార్డ్ బీఆర్ఎస్ నేతలు పిండి అరవింద్, గూడూరి రాజు(బండల), అభిబ్, కౌన్సిలర్లు శ్రీనివాస్ యాదవ్, విటోభ, బింగి రాజేశం, సాయి, పట్టణ యూత్ అధ్యక్షుడు రెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేముల నగేష్, కంటెమ్ రాజు, మంచే నర్సింహులు, పత్రి శ్రీనివాస్. రాహుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**



రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు దినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహించాలని అక్కన్నపేట మండలం మైనమ్మ వాగుతండా సర్పంచ్ భూక్య కృష్ణానాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతీ ఏటా ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించుకుంటామన్నారు. గత ప్రభుత్వం జయంతి వేడుకలు నిర్వహించేందుకు తండాలకు ప్రత్యేక నిధులు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు గిరిజనుల అభివృద్ధి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఇందుకోసం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# సిద్దేశ్వరుని సేవలో మైనంపల్లి

- కాంగ్రెస్ బీ-ఫాంలకు ప్రత్యేక పూజలు
- ఫొటో: సిద్దేశ్వర స్వామి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ పట్టణానికి సమీపంలో గల ముత్తాయి కోట సిద్దేశ్వరుడికి సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థులకు అందజేసే బీఫాంలకు పూజలు చేశారు. అర్చకులు గోవింద్ మహారాజ్ ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట నాయకులు చంద్రపాల్, వెంకటరమణ, అశోక్, ఉప్పల రాజేశ్, బొజ్జ పవన్, బాలకృష్ణ, పరశురాం గౌడ్, మహేందర్ రెడ్డి, దుర్గాప్రసాద్, శ్రీధర్ యాదవ్, గుండారం కిరణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## వన్యప్రాణుల నివాసాలను నాశనం చేయొద్దు

**ముద్ర, హైదరాబాద్:**
అడవులను నరికివేసి వన్యప్రాణుల నివాసాలను నాశనం చేయవద్దని మెదక్ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటయ్య సూచించారు. సోమవారం మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ గ్రామంలో జిల్లా పశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ వార్షికోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అలాగే జడ్పీ పాఠశాల విద్యార్థులకు జంతు సంక్షేమం, వాటి పట్ల మన బాధ్యత అనే అంశంపై అధికారులు కీలక అంశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి మాట్లాడుతూ జంతువులు ప్రకృతిలో మనుషులతో సమానమైన భాగస్వాములన్నారు. మన పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో జంతువులు కీలక పాత్ర పోషిస్తున్నాయని మన పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో జంతువులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కుక్కలు మనకు నమ్మకమైన స్నేహితులుగా ఉంటే, ఆవులు, ఎద్దులు వ్యవసాయంలో మనకు ఎంతో సాయపడతాయని చెప్పారు. అడవి జంతువులు పర్యావరణాన్ని కాపాడుతున్నాయని అన్నారు. నోరు లేని జీవుల బాధ.. జంతువులకు భాష లేదు కానీ భావాలు ఉంటాయన్నారు. మనలాగే వాటికి కూడా ఆకలి, దాహం, నొప్పి మరియు భయం వేస్తాయన్నారు. దురదృష్టవశాత్తు, మనిషి తన స్వార్థం కోసం జంతువులను హింసించడం మనం చూస్తూనే ఉన్నామని తెలిపారు. వీధి కుక్కలను కొట్టడం, పక్షులను పంజరాల్లో బంధించడం, అడవులను నరికివేసి వన్యప్రాణుల నివాసాలను నాశనం చేయడం వంటివి తప్పులను మనం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుపాకి రాములు, మండల పశువైద్యాధికారి డాక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




# టెన్త్ టాపర్లకు రూ.2.2 కోట్ల నగదు

- అదనపు కలెక్టర్ నగేష్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలని శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల నుంచి పదో తరగతి బోర్డు పరీక్షలు రాసే విద్యార్థుల్లో టాపర్లకు రూ.2.2 కోట్ల నగదు బహుమతులను ప్రకటించిందని పేర్కొన్నారు. శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ వారు పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు చేపట్టిన చదువుకో తెలంగాణ వాల్ పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ వారు ప్రభుత్వ పాఠశాలల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ విద్యార్థికి రూ.5 లక్షలు, సెకండ్ ర్యాంక్ విద్యార్థికి రూ.3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్ కు రూ.2 లక్షల చొప్పున, ప్రతి నియోజకవర్గ టాపర్‌కు రూ.ఒక లక్ష చొప్పున, 612 మండలాల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ.10వేల నగదు అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీనివాస్ రావు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మెదక్ మేనేజర్, జూనియర్ మేనేజర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**
జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు సంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో ప్రలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ 81253 52721 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ హెల్ప్ డెస్క్ మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సెలవు రోజులతో సహా 24 గంటలు, మూడు షిఫ్టుల లో సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతరంగా పనిచేస్తుందన్నారు. హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి పరిశీలించి, ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.



# మెదక్ లో కాంగ్రెస్ బోణీ

- గోదల మానస- సాయిరాం రెండోసారి ఏకగ్రీవం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ బోణి కొట్టింది. 32వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా గోదల మానస సాయిరాం రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ తరపున నామినేషన్ వేసిన గోదల జ్యోతి, ఇతరులు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో మానస ఏకగ్రీవమయ్యారు. మానస 2020లో బీఆర్ఎస్ పార్టీ తరపున నామినేషన్ వేసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మానస వరుసగా రెండుసార్లు ఏకగ్రీవం కావడం విశేషం.

**13 నామినేషన్ల ఉపసంహరణ..**
మెదక్ లో ఇప్పటివరకు 13 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులు వివిధ పార్టీల తరపున, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. మంగళవారం సాయంత్రం మూడు గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉన్నందున మరికొంతమంది ఉపసంహరించుకునే అవకాశం ఉంది.



# ప్రజావాణి ఆర్జీలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి, ముద్ర ప్రతినిధి:**
ప్రజావాణిలో వచ్చిన ఆర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను అడిషనల్ కలెక్టర్లు మాధురి, పాండు లతో కలిసి కలెక్టర్ స్వీకరించారు. అర్జీదారులు భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలతో పాటు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, విద్యుత్, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, ఎక్సైజ్, పశు సంవర్ధక తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కి 16 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఆయా వినతులను పరిశీలించి అర్జిదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, కలెక్టరేట్ ఏఓ తదితరులు పాల్గొన్నారు.





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**

విశాఖపట్నం బీచ్‌లు (ఆంధ్రప్రదేశ్): ఆర్కే బీచ్, రిషికొండ బీచ్‌లు పర్యాటకులకు ఎంతో ఇష్టమైనవి. సముద్ర తీరంతో పాటు సబ్ మెరైన్ మ్యూజియం ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ.



# నాడు పార్కులే... నేడు ప్లాట్లుగా మారుతున్నాయి

- ప్రజావసర స్థలాలను పరిరక్షించాలి
- హైడ్రా ప్రజావాణికి 65 ఫిర్యాదులు

**ముద్ర, హైదరాబాద్:**

లే ఔట్ వేసినప్పుడు పార్కులుగా చూపించారు. తర్వాత అవి ప్లాట్లుగా మార్చేసి లే ఔట్ వేసిన వారితో పాటు.. కాలనీ సంక్షేమ సంఘాల వారు అమ్ముకుంటున్నారని పలువురు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ లే ఔట్ నుంచి హుడా లే ఔట్ వరకూ ఇదే పరిస్థితి నెలకొందని వాపోయారు. పార్కులుగా పేర్కొంటూ ఆయా గ్రామపంచాయతీలకు, మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు గిఫ్ట్ డీడ్‌లు రాసిచ్చిన తర్వాత కూడా పార్కు స్థలాలు ప్లాట్లుగా మారినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు, రహదారులను కూడా వదలకుండా కబ్జాలు చేస్తున్నారంటూ పలువురు ఫిర్యాదు చేస్తున్నారు. గతంలో 7 కాలనీలకు దారి చూపుతూ ఆక్రమణలతో పాటు ప్రహరీలను హైడ్రా తొలగించినా ప్రయోజనం లేకపోయిందని తుర్కయాంజల్ మున్సిపాలిటీ 24వ వార్డు నివాసితులు ఫిర్యాదు చేశారు. అక్కడ రోడ్డు వేయడానికి ఆక్మణదారులు అడ్డు చెబుతున్నారని చెప్పారు. స్థానిక అధికారులు చొరవ చూపడంలేదని , .వెంటనే రోడ్డు వేయాలని కోరారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి వచ్చిన 65 ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేరుగా పరిశీలించి.. ఫిర్యాదు దారుల ముందే సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

**ఫిర్యాదులు ఇలా..**

- రంగారెడ్డి జిల్లా భాగ్ హయత్‌నగర్ సర్వే నంబరు 97లో శ్రీ రాంనగర్ కాలనీలో 300 గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు పార్కులు కబ్జాకు గురౌతున్నాయని కాలనీ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పార్కుల కోసం కేటాయించిన స్థలాలను ప్లాట్లుగా మార్చేసి అమ్ముకుంటున్నారని.. ఇలా ఈ కాలనీలో నాలుగు చోట్ల కబ్జాలు జరుగుతున్నాయని.. వెంటనే పార్కులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే జిల్లాలోని సరూర్‌నగర్ మండలం, చంపాపేట్ విలేజ్‌లోని దుర్గాభవానీ నగర్‌లో361 గజాల పార్కు ఇంటి స్థలంగా మారిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం సుభాష్ నగర్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో పార్కు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు ఆక్రమణలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఫిర్యాదు చేశారు. కాలనీలో ప్లాట్ నంబర్లు 317-318, 284-285, 265-266, 259-260, 320 సమీపం లోని పార్కులతో పాటు. 336-337 మధ్య ఉన్న మొత్తం 6 పార్కులు, ఓపెన్ ప్లేస్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయని వారు తెలిపారు. గతంలో GHMC కాంపౌండ్ వాల్ నిర్మాణానికి వర్క్ ఆర్డర్ ఇచ్చినప్పటికీ, రాజకీయ జోక్యంతో పనులు ఆగిపోయాయని కాలనీ వాసులు వాపోయారు.
- మహేశ్వరం నియోజకవర్గం బడంగిపేట సర్కిల్ ఆల్మాస్‌గూడ 57వ డివిజన్ శ్రీ హిల్స్ కాలనీ ఫేజ్ 2లో 1983లో 460 ప్లాట్లతో లే ఔట్ వేశారు. ఇందులో 2,260 గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. ఈ పార్కులో ఇప్పటికే 6 ఇళ్లు వచ్చేయగా మిగిలిన స్థలాన్ని అయినా కాపాడాలని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు.




- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మచ్చబొల్లారంలోని విజయ విహార్ ఎన్‌క్లేవ్ లే ఔట్‌లో రహదారులతో పాటు. వరద కాలువ నిర్మాణానికి 20 ఫీట్ల మేర ఖాళీ స్థలాన్ని ఉంచితే, పక్కనే ఉన్న భూ యజమానులు ఆ 20 ఫీట్ల రహదారిని కబ్జా చేసేశారు. లే ఔట్ ప్రకారం ఖాళీ స్థలాన్ని తమకు అందజేయాలని హైడ్రా ప్రజావాణిలో నివాసితులు ఫిర్యాదు చేశారు.
- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం మచ్చబొల్లారంలో 432 ప్లాట్లతో సాయి రెడ్డి లేఔట్ వేశారు. ఈ లే ఔట్‌కు చేరువలో మూత్కుల్ కుంట ఉంది. అలుగుమీద అక్ర మ కట్టడాలు రావడంతో చెరువులోని నీరు బయటకు వెళ్లడానికి వీలు లేని పరిస్థితి. ఈ లే ఔట్‌లో 90 ప్లాట్ల వరకూ నీట మునుగుతున్నాయి. గతంలో ఈ చెరువు 5.22 ఎకరాలుగా ఉండేది. మురుగు నీరు కూడా చేరడం. చెరువు నుంచి కిందకు నీరు వెళ్లే అలుగు ఆక్రమణలకు గురి కావడంతో నీటి నిలువలు పెరుగుతున్నాయని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు.
- రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్ గందంగూడలోని గ్రీన్ పార్క్స్ కాలనీలో హైదర్షాకోట్ బైరాగి గూడ ప్రధాన రహదారి 30 ఫీట్లుండగా.. పక్కనే స్థలం ఉన్న వారు మొత్తం 12 అడుగులకు పైగా ఆక్రమించేయడంతో ఆ రోడ్డు కుంచించుకుపోయిందని. దీంతో తమకు దారి లేకుండా పోయిందని గ్రీన్ పార్క్స్ కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
- మణికొండలోని సచివాలయ ఉద్యోగుల కాలనీ లేఔట్‌లో పార్కులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురయ్యాయని వైఎస్ఆర్ సెక్రటేరియట్ ఎంప్లాయిస్‌కాలనీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. 2,236గజాల స్థలంతో పాటు.. 1,163 గజాల స్థలం కబ్జాలకు గురి కాకుండా కాపాడాలని కోరారు. అలాగే ఇక్కడ వక్ఫ్ ల్యాండ్‌గా పేర్కొంటున్న భూములు కూడా కబ్జాలకు గురి అవుతున్నాయన్నారు. గతంలో తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర నగర్ వైఎస్ ఆర్‌కాలనీలను కలుపుతూ 60 ఫీట్ల రహదారిని అందుబాటులోకి తెచ్చిన హైడ్రాకు ధన్యవాదాలు తెలిపారు.

# హార్వర్డ్ లో చదువుకున్నా గుణం మారలేదు

- సీఎం రేవంత్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**



అమెరికా వెళ్లి హార్వర్డ్ లో నాలుగు రోజులు చదువుకున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వెనకటి గుణం మాత్రం మార్చుకోలేదని మాజీ మంత్రి హరీశ్ రావు ఎద్దేవా చేశారు. సోమవారం రావి నారాయణ రెడ్డి స్మారక జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. కనీస సంస్కారంతో పాటు చిల్లర మాటల్లో, వెకిలి చేతల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. ద్వేష రాజకీయాలకు, నరం లేని నాలుకతో విషం చిమ్మే కుసంస్కారానికి నిలువెత్తు నిదర్శనం రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. దేశానికి గాంధీ జాతిపిత అయినట్లే, తెలంగాణను సాధించిన కేసీఆర్ కూడా జాతిపితే అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై హితబోధ చేసిన కొద్ది నిమిషాలు కూడా గడవకముందే.. అదే వేదికపై సీఎం రేవంత్ రెడ్డి తన అసలు స్వభావాన్ని, తన మాటల ద్వారానే బయటపెట్టుకున్నారని విమర్శించారు. హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ముగియకముందే, రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారని పేర్కొన్నారు. కేసీఆర్‌పై కడుపులో కత్తులు, నోటిలో విషం పెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి తన అజీర్తిని, అక్కసును మరోసారి బయటపెట్టారన్నారు. హేట్ స్పీచ్ అంటే ఏమిటో చెప్పడానికి పుస్తకాలు అవసరం లేదు.. రేవంత్ రెడ్డి ప్రసంగాలు చాలు అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. నాలుగు కోట్ల ప్రజలు ఏకమై స్వరాష్ట్రం కోసం కొట్లాడుతుంటే ఆంధ్రా పాలకుల బూట్లు తుడుస్తున్న నీకు కేసీఆర్ గురించి, తెలంగాణ ఉద్యమం గురించి ఎలా తెలుస్తుంది అని నిలదీశారు. ఉద్యమకారులపైకి తుపాకి ఎక్కుపెట్టిన నీకు ఉద్యమకారుల గురించి మాట్లాడే హక్కు ఉందా అని నిలదీశారు. ప్రశ్నిస్తే, నిలదీస్తే అరెస్టులు, కేసులతో నిరంకుశంగా వ్యవహరిస్తున్న నీకు ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే హక్కు ఉందా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు. అధికారాన్ని ప్రజల బాగు కోసం కాకుండా, ప్రతిపక్షాలపై రాజకీయ కక్షల కోసం వినియోగిస్తున్న నీకు అధికార దుర్వినియోగం గురించి మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు. లక్కీ లాటరీలో సీఎం అయిన నీకు ఇవన్నీ ఎలా తెలుస్తాయి? ఎలా అర్థం అవుతాయి అని విమర్శించారు. నువ్వు హార్వర్డ్ వెళ్లినా, అంతరిక్షం వెళ్లినా నీ చెత్త బుద్ధి మారదు, నోటి మురికి పోదు అన్నది స్పష్టం అవుతోందని హరీశ్ రావు తీవ్ర విమర్శలు గుప్పించారు.

# బడ్జెట్‌లో తెలంగాణకు గుడ్ న్యూస్

- ప్రతిపాదనలో హైస్పీడ్ డైమండ్ కారిడార్
- రెండు గంటల్లో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రయాణం
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

**ముద్ర న్యూస్:**



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు గుడ్ న్యూస్ దక్కిందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. బడ్జెట్ నేపథ్యంలో దేశవ్యాప్తంగా రైల్వే అధికారులు, రాష్ట్రాల మీడియాతో వర్చువల్ సమావేశం నిర్వహించిన ఆయన, తాజా కేటాయింపులు మరియు హైస్పీడ్ రైలు ప్రాజెక్టులపై వివరాలు తెలిపారు. ఈ బడ్జెట్‌లో తెలంగాణకు రైల్వే రంగానికి రూ.5,454 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలను కలిపే హైస్పీడ్ డైమండ్ కారిడార్ ప్రతిపాదనలో ఉందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కేవలం రెండు గంటల్లోనే చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే హైదరాబాద్ నుంచి చెన్నై, పుణె, బెంగళూరుకు హైస్పీడ్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయని, ఇవి గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయని స్పష్టం చేశారు. ఈ కారిడార్ వల్ల దక్షిణ భారత రాష్ట్రాల మధ్య ఆర్థిక అభివృద్ధి, హెల్త్ టూరిజం వేగం పుంజుకుంటుందని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు కేంద్రం ఊతం

- 4.13 లక్షల గృహాలకు నిధుల కేటాయింపు

**ముద్ర, హైదరాబాద్:**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంకు కేంద్రం నుంచి కీలక ఆర్థిక సహాయం లభించనుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలోని సుమారు 4.13 లక్షల ఇళ్లకు కేంద్రం తన వాటా నిధులు విడుదల చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేల చొప్పున కేంద్రం సహకారం అందించనుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రం కోరిన 13 లక్షల ఇళ్లలో భాగంగా, ప్రస్తుతం ఈ 4.13 లక్షల ఇళ్లకు నిధులు ఖరారయ్యాయి. పీఎంఏవై అర్బన్ 2.0 కింద పట్టణాల్లో 1.13 లక్షల ఇళ్లకు కేటాయింపులు ఉండగా, త్వరలో రూ.1,690 కోట్లు విడుదల కానున్నాయి. అలాగే పెండింగ్‌లో ఉన్న 33 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రూ.500 కోట్లు బకాయిలు చెల్లించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తొలి దశలో 3 లక్షల ఇళ్లకు రూ.2,160 కోట్లు రానుండగా, ఆదివాసీల కోసం ఇప్పటికే 10 వేల ఇళ్లు మంజూరయ్యాయి. రాష్ట్రం తన వాటా జత చేస్తే, పేదల సొంతింటి కల వేగంగా సాకారం కానుంది.

# మున్సిపల్ ఎన్నికల విధులు బాధ్యతగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్

**ముద్ర, వికారాబాద్ బ్యూరో:**




జిల్లాలో జరగనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు అత్యంత బాధ్యతతో ఎన్నికల విధులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు ఎన్నికల నియమ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని, పోలింగ్ కేంద్రానికి సంబంధించిన పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. చట్టబద్ధమైన నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రిసైడింగ్ అధికారికి ఉంటుందని, పోలింగ్ సామగ్రిని స్వీకరించిన వెంటనే సమగ్రంగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఒక ఓటర్‌కు ఒకే ఓటు అనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, మహిళలు, దివ్యాంగులకు పోలింగ్ సమయంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ల ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సహాయంతో ఎన్నికల విధులపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ నోడల్ అధికారి మాధవ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహారెడ్డి, నాగరాజు, నటరాజు తదితరులు పాల్గొన్నారు.



# తిరుమల శ్రీవారి భక్తులకు సూపర్ న్యూస్..

- ఇక నుంచి మరింత వేగంగా స్వామివారి దర్శనం.. తగ్గనున్న వెయిటింగ్..

**ముద్ర న్యూస్ :**

తిరుమల శ్రీవారి భక్తులకు మరో సంతోషకరమైన వార్త. స్వామివారి దర్శనం మరింత వేగంగా, సులభంగా జరిగేలా తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ) అత్యాధునిక ఏఐ టెక్నాలజీని విస్తృతంగా వినియోగిస్తోంది. ఆలయ పరిసరాలు, మాడవీధులు, క్యూలైన్లలో ఏఐ ఆధారిత ఫేస్ రికగ్నిషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భక్తుల రద్దీని క్షణక్షణం అంచనా వేయనున్నారు.ఈ కెమెరాలన్నీ వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1లోని ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించబడతాయి. దీంతో అధికారులు భక్తుల కదలికలను నేరుగా గమనించి దర్శనాల నిర్వహణను తక్షణమే సర్దుబాటు చేయగలుగుతారు. రద్దీ ఎక్కువైన చోట్ల వెంటనే చర్యలు తీసుకోవడం, భద్రతను పటిష్టం చేయడం సులభమవుతుంది. ఇప్పటికే వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వంటి పర్వదినాల్లో ఈ విధానం విజయవంతమైంది. రానున్న రోజుల్లో వాహన సేవల పర్యవేక్షణకూ ఈ ఏఐ టెక్నాలజీని ఉపయోగించనున్నారు. ఫలితంగా *తిరుమల*లో గంటల తరబడి క్యూల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి తగ్గి, భక్తులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన దర్శనం అందనుంది.

# అందుకే ఆ తల్లి తన బిడ్డలతో మరణాన్ని ఎంచుకుంది..

- మానసిక కుంగుబాటుతో పిల్లలతో కలిసి బలవన్మరణానికి పాల్పడ్డ అమ్మ
- చర్లపల్లి రైల్వే ట్రాక్ ఘటనలో కీలక ఆధారాల సేకరణ

**ముద్ర న్యూస్:**





చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేట్రాక్‌పై తల్లి, ఇద్దరు ఇంటర్ విద్యార్థుల బలవన్మరణం తెలుగు రాష్ట్రాలను షాక్‌కు గురిచేసింది. సాధారణంగా బిడ్డలకు చిన్న గాయం తగిలితేనే కలవరపడే తల్లి, వారినే వెంటబెట్టుకుని మరణాన్ని ఎంచుకోవడం వెనుక ఉన్న కారణాలపై సమాజం మొత్తం చర్చిస్తోంది. ఈ ఘటనలో ఒంటరితనం, మానసిక ఒత్తిడే ప్రధాన కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

శనివారం తెల్లవారుజామున గూడ్స్ రైలు కిందపడి విజయరెడ్డి, ఆమె ఇద్దరు బిడ్డలు చేతన రెడ్డి, విశాల్ రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**తల్లి మాటే లోకం..**

తండ్రి విదేశాల్లో ఉండటంతో పిల్లలకు అన్నీతానై నిలిచింది తల్లే. ఆమె మాటే వారి లోకం, ఆమె నిర్ణయమే వారి దారి. ఆత్మహత్యకు ముందు కారులో తల్లి చేసిన మాటలు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎంతో జీవితం చూడాల్సిన వయసులో ఉన్న పిల్లలు తల్లి నిర్ణయాన్ని ప్రశ్నించలేకపోవడం ఈ ఘటనను మరింత విషాదంగా మార్చింది.

**చాటింగ్ వివరాల పరిశీలన..**

విజయరెడ్డి మొబైల్‌ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపేందుకు సిద్ధమయ్యారు. ఆమె చివరిగా మాట్లాడిన ఫోన్‌కాల్స్, చాటింగ్ వివరాలను పరిశీలిస్తున్నారు. ఐటీ కంపెనీలో ఆమె బృందంలో పనిచేసే ఇద్దరిని జీఆర్పీ కార్యాలయానికి పిలిపించి విచారించగా, ప్రాజెక్ట్ పనులపై మాత్రమే చాటింగ్ జరిగిందని వారు వెల్లడించారు. కుటుంబ విభేదాలు, ఆస్తి తగాదాల కోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించగా, దుబాయ్ నుంచి భర్త సురేందర్ రెడ్డి వచ్చిన తర్వాత భువనగిరి జిల్లా బీబీనగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

**సమాజానికి హెచ్చరిక..**

ఈ ఘటన ఓ కుటుంబ విషాదమే కాదు. ఒంటరితనం, మానసిక ఒత్తిడి ఎంత ప్రమాదకరమో తెలియజేసే హెచ్చరిక. బయటకు బలంగా కనిపించే వ్యక్తుల్లోనూ లోపల తీవ్రమైన ఆవేదన దాగి ఉండొచ్చు. సమయానికి మాట్లాడటం, చేయూత ఇవ్వడం, మానసిక సాయం అందించడం ఎన్నో ప్రాణాలను కాపాడగలదన్న విషయాన్ని ఈ విషాదం మరోసారి గుర్తు చేస్తోంది.

**ఒంటరిగా మారిన జీవితం..**

2007లో సురేందర్ రెడ్డి, విజయ రెడ్డిల వివాహం జరిగింది. నాలుగేళ్ల క్రితం సురేందర్ రెడ్డికి దుబాయ్‌లో ఉద్యోగం రావడంతో అక్కడికి వెళ్లారు. ఉప్పల్ డిపో రాఘవేంద్రనగర్‌లో తల్లి పుష్పలతతో కలిసి విజయ రెడ్డి ఇద్దరు పిల్లలను పెంచుకుంటూ వచ్చారు. ఐటీ కంపెనీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తున్న ఆమెకు రాత్రి విధులు కావడంతో పిల్లలను హాస్టళ్లలో ఉంచి చదివించాల్సి వచ్చింది.

ఉద్యోగ భారం, కుటుంబ బాధ్యతలు, భర్త దూరం.. ఇవన్నీ కలిసి ఆమెలో ఒంటరితనాన్ని మరింత పెంచాయని సన్నిహితులు చెబుతున్నారు. పదిహేను రోజులుగా “నేను ఒంటరిదాన్నే” అనే భావనతో తీవ్రంగా కుంగిపోయిందని, అదే విషయాన్ని బంధువులు, స్నేహితులతో పదేపదే పంచుకుంటూ బాధపడేదని సమాచారం.

**వాట్సప్ స్టేటస్‌గా సూసైడ్ నోట్..**

శుక్రవారం సాయంత్రం హాస్టళ్ల నుంచి పిల్లలను తీసుకొచ్చిన విజయరెడ్డి చర్లపల్లి రైల్వేస్టేషన్ పార్కింగ్‌లో కారును నిలిపారు. పార్కింగ్ స్లిప్ వెనుక వైపు “నాకు ఇక జీవించాలని లేదు. నేను దూరమైతే పిల్లలు ఒంటరవుతారు” అంటూ సూసైడ్‌నోట్ రాసి కారులో వదిలేశారు. అదే నోటును ఫొటో తీసి వాట్సప్ స్టేటస్‌గా ఉంచినట్టు పోలీసులు గుర్తించారు.

తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు

వరంగల్ - రామప్ప దేవాలయం (తెలంగాణ): యునెస్కో గుర్తించిన రామప్ప ఆలయం కాకతీయుల శిల్పకళా వైభవానికి నిదర్శనం. ఇక్కడి వేయి స్తంభాల గుడి, లక్నవరం సరస్సు తప్పక చూడాల్సినవి.

# సజ్జనార్ ట్వీట్‌తో రాజకీయ దుమారం

- సీపీ వైఖరిపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం
- నువ్వు పోలీసువి మాత్రమే జడ్జివి కాదంటూ ఆరోపణలు

**ముద్ర న్యూస్ :**






V.C. Sajjanar, IPS @SajjanarVC · 20h
The Special Investigation Team (SIT) has concluded the questioning of Gajwel MLA and former Chief Minister Sri. K. Chandrashekar Rao in connection with the illegal phone-tapping case.

#Hyderabad #Telangana

హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ చేసిన ఒక ట్వీట్ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉద్రిక్తతకు దారి తీసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కె. చంద్రశేఖర్ రావును ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించిన అనంతరం సజ్జనార్ తన వ్యక్తిగత 'ఎక్స్' ఖాతాలో చేసిన పోస్టు తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ ట్వీట్‌ను ఆధారంగా చేసుకొని బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు సీపీపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది. ఈ బృందానికి చీఫ్‌గా వ్యవహరిస్తున్న సజ్జనార్ ఇటీవల మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. ఈ విచారణ పూర్తైన అనంతరం, "అక్రమ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన కేసులో గజ్వేల్ ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును సిట్ ప్రశ్నించడం పూర్తయ్యింది" అంటూ సజ్జనార్ ట్వీట్ చేయడం రాజకీయ దుమారానికి కారణమైంది. ఈ ట్వీట్‌లో కేసీఆర్‌ను 'గారు' అని సంబోధించకపోవడం, అలాగే ప్రతిపక్ష నేతగా ఆయన హోదాను ప్రస్తావించకపోవడంపై బీఆర్ఎస్ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాదు, విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని 'అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు'గా పేర్కొనడం ద్వారా సిట్ చీఫ్ ముందుగానే ఒక నిర్ణయానికి వచ్చారని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. సజ్జనార్ న్యాయమూర్తి కాదని, కేవలం ఒక పోలీసు అధికారి మాత్రమేనని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్ అక్రమమా కాదా అన్నది నిర్ణయించేది న్యాయస్థానాలేనని, అధికారులు ట్వీట్లు లేదా లీకుల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించకూడదని హెచ్చరించారు. చట్టపరమైన స్పష్టత లేకుండానే ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు కూడా సజ్జనార్ ట్వీట్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విచారణ పూర్తై, న్యాయస్థానాలు తుది తీర్పు ఇవ్వకముందే ఫోన్ ట్యాపింగ్‌ను 'అక్రమం'గా ఎలా పేర్కొంటారని ప్రశ్నించారు. అఖిల భారత సేవల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి ఇలా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఈ కేసులో సిట్ చీఫ్ ముందే అభిప్రాయం ఏర్పరుచుకున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు. మొత్తంగా ఒక ట్వీట్ కారణంగా ఫోన్ ట్యాపింగ్ కేసు కొత్త రాజకీయ రంగు పులుముకుంది. సజ్జనార్ పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఈ వివాదం రానున్న రోజుల్లో మరింత తీవ్రతరం అయ్యే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# కార్మికుల సంక్షేమానికి అండగా ఉంటా

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**ముద్ర, మల్కాజిగిరి :**

నిరుపేదలు, మధ్యతరగతి కార్మికుల కష్టార్జితంతో కార్పొరేట్ కంపెనీలు చెలగాటమాడటం సరికాదనని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హెచ్బీఎల్ కంపెనీలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న సుమారు 4వేల మంది కార్మికులు ప్రభుత్వం జారీ చేసిన జీఓ మేరకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ కంపెనీ ఎదుట ధర్నా చేపట్టారు. సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కార్మికుల వద్దకు చేరుకొని వారికి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రోజుకు రూ.450 నుంచి రూ.550 వరకు మాత్రమే వేతనం ఇస్తున్నారని, పెరిగిన జీవన వ్యయాలను దృష్టిలో పెట్టుకుని కనీసం రూ.650 వరకు చెల్లించాల్సిన అవసరం ఉందని కార్మికులు తెలిపారు. కార్మిక వ్యతిరేక విధానాలను విరమించి వెంటనే జీతభత్యాలు సవరించాలని వారు డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేస్తూ, హెచ్‌బీఎల్ యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, అలియాబాద్ మున్సిపాలిటీ వివిధ వార్డుల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతి

**ముద్ర, వికారాబాద్ బ్యూరో :**

వికారాబాద్ పట్టణ పరిధిలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయం మలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కొండాపూర్ కలాన్ గ్రామానికి చెందిన చాకలి లాలయ్య (35) తన కుమారుడు చాకలి రిథిక్ (6)తో కలిసి మోటార్‌సైకిల్ నంబర్ టీఎస్ 34 6577పై వికారాబాద్ వైపు ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో ఆయన భార్య మేఘన తన కుమార్తె రిషిక (7)తో కలిసి స్కూటీ నంబర్ టీఎస్ 34 జే5735పై వెనుకగా వస్తున్నారు. ఈ క్రమంలో వికారాబాద్ నుంచి తాండూర్ వైపు క్రేన్ లోడ్‌తో వెళ్తున్న లారీ నంబర్ హెచ్ఆర్ 38 వై 0333ను డ్రైవర్ అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వచ్చి ముందుగా లాలయ్య మోటార్‌సైకిల్‌ను ఢీకొట్టాడు. అనంతరం స్కూటీని కూడా ఢీకొట్టడంతో లారీ నియంత్రణ కోల్పోయింది. లారీపై ఉన్న క్రేన్ భాగాలు కింద పడటంతో లాలయ్య, అతని కుమారుడు రిథిక్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించిన అనంతరం రిథిక్ బాలుడు ఉదయం 8 గంటల 38 నిమిషాలకు మృతి చెందినట్లు ప్రకటించారు. చికిత్స పొందుతూ లాలయ్య ఉదయం 10 గంటల 37 నిమిషాలకు మృతి చెందినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో లారీ డ్రైవర్ ఎం.డి షకీర్ (36), హర్యానా రాష్ట్రానికి చెందినవాడిగా గుర్తించామని, మద్యం సేవించి వాహనం నడిపినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సీఐ రఘు వెల్లడించారు.



# కార్యకర్తలకే కమలం పెద్ద పీట

- 80 శాతం మంది కార్యకర్తలకే కార్పొరేటర్ టిక్కెట్లు
- గెలిచే అవకాశం లేని చోట మాత్రమే ప్రత్యామ్నాయ టిక్కెట్లు
- సర్వే నివేదికల ఆధారంగా టిక్కెట్లు ఖరారు చేసిన త్రిసభ్య కమిటీ
- 66 మంది అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం

**ముద్ర న్యూస్ :**



కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసే అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాయి. మొత్తం 66మంది అభ్యర్థుల జాబితాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు కొద్దిసేపటి క్రితం మీడియాకు విడుదల చేశారు. అభ్యర్థుల జాబితాను విశ్లేషిస్తే 80శాతం మంది కార్యకర్తలకే టిక్కెట్లు దక్కాయి. ఇతర పార్టీల నుండి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని జరుగుతున్న ప్రచారమంతా ఒట్టిదేనని తేలిపోయింది. పార్టీని నమ్ముకుని ఏళ్ల తరబడి కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకే ఈసారి పెద్దపీట వేయడం గమనార్హం. గెలిచే అవకాశం లేని డివిజన్లలో మాత్రమే ఇతర పార్టీల నుండి వచ్చిన మాజీ కార్పొరేటర్లకు, ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకులకు టిక్కెట్లను కేటాయించారు. టిక్కెట్ల కేటాయింపులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఎక్కడా జోక్యం చేసుకోలేదు. జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, కోమాల ఆంజనేయులు, ఓదేలు ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీని నియమించారు. అదే సమయంలో ఎవరికి టిక్కెట్లు కేటాయించాలనే అంశంపై డివిజన్ల వారీగా సర్వేలు నిర్వహించారు. వివిధ సర్వే ఏజన్సీల ద్వారా వచ్చిన నివేదికలతోపాటు కార్యకర్తల పని తీరును పరిగణలోకి తీసుకుని గత వారం రోజుల నుండి డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ చేసిన త్రిసభ్య కమిటీ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి పంపింది. ఆ జాబితాను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు ఈరోజు ఆ జాబితాను అధికారికంగా విడుదల చేశారు.

# పసిడికి భారీ షాక్ : కుప్పకూలిన బంగారం, వెండి ధరలు

- డాలర్ బలపడటం, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడమే కారణం

**ముద్ర, బిజినెస్ న్యూస్ :**



బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది శుభవార్త. గరిష్ఠ స్థాయిల నుంచి ఒక్కసారిగా కుప్పకూలిన ఈ విలువైన లోహాల ధరలు మరింత దిగువకు వచ్చాయి. లాభాల స్వీకరణ ప్రభావంతో శుక్రవారం భారీగా పడిపోయిన బంగారం, వెండి ధరలు సోమవారం కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ స్పాట్ బంగారం మార్కెట్‌లో బంగారం ఔన్సు దాదాపు 6శాతం క్షీణించి 4,538 డాలర్లకు చేరింది. వెండి ఔన్సు 74డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఈ ప్రభావం దేశీయ మార్కెట్‌పై కూడా స్పష్టంగా కనిపించింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1.48లక్షల వద్ద కొనసాగుతుండగా, కిలో వెండి ధర రూ.2.48లక్షల వద్ద ఉంది. ఇటీవల బంగారం రూ.1.80లక్షలు, వెండి దాదాపు రూ.4లక్షల గరిష్ఠానికి చేరిన విషయం తెలిసిందే. ఆ గరిష్ఠాలతో పోలిస్తే ఇప్పుడు ధరలు గణనీయంగా తగ్గాయి. బంగారం, వెండి కొనుగోలు ప్రణాళికలతో ఉన్న వారికి ఇటీవల ధరలు షాక్ ఇవ్వగా, ఇప్పుడు తగ్గుదల ఊరట కలిగించే అంశంగా మారింది. వస్తువుల లావాదేవీలు జరిగే మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఏప్రిల్ కాంట్రాక్టులో 10 గ్రాముల బంగారం ధర రూ.1,39,446 వద్ద కొనసాగుతోంది. ఇది సుమారు 6 శాతం పతనం. మార్చి కాంట్రాక్టులో కిలో వెండి ధర ఏకంగా 14.55 శాతం తగ్గి రూ.2.27 లక్షలకు చేరింది.

**ధరలు పడిపోవడానికి కారణాలు ఇవే..**

అమెరికా కేంద్ర బ్యాంక్ (ఫెడరల్ రిజర్వ్) చైర్మన్‌గా జెరోమ్ పావెల్ స్థానంలో కెవిన్ వార్ష్ పేరును మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించడంపై మదుపర్లు ప్రతికూలంగా స్పందించారు. దీని ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో సవరణ జరిగింది. ఇతర కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలపడటం వల్ల కూడా లోహాల ధరలు దిగివచ్చాయి. రాకెట్ వేగంతో దూసుకెళ్లిన ఈ రెండు లోహాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం మరో ప్రధాన కారణం. అంతర్జాతీయ మార్కెట్లో ఇటీవల బంగారం ఔన్సు 5,600 డాలర్లు, వెండి ఔన్సు 122డాలర్ల వరకు చేరిన సంగతి తెలిసిందే. మరోవైపు ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలు ఇవ్వడంతో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గే అవకాశాలున్నాయని అంచనాలు వెలువడ్డాయి. ఈ పరిణామాలన్నీ కలిసి బంగారం, వెండి ధరలు పడిపోవడానికి దోహదపడుతున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

# ఐటీ కారిడార్‌లో పాదచారుల భద్రతకు స్కైవాక్

- రాయదుర్గం-టీ హబ్ మధ్య తొలి దశ ప్రతిపాదనలు

**ముద్ర, శేరిలింగంపల్లి :**



సైబరాబాద్ ఐటీ కారిడార్‌లో పాదచారుల భద్రతను పెంచి, ట్రాఫిక్ రద్దీని గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి టీ హబ్ వరకు తొలి దశ స్కైవాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ఐపీఎస్ నేతృత్వంలో అధికారుల బృందం సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించింది. ఈ స్కైవాక్ రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి ఐకియా ఫ్లైఓవర్, ఐఓసీఎల్ మీదుగా టీ హబ్ వరకు విస్తరించనుంది. ఐటీ సంస్థలు, కార్యాలయాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో పాదచారుల రాకపోకలు భారీగా ఉండటంతో పాటు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. స్కైవాక్ నిర్మాణం పూర్తయితే వాహనాల రాకపోకలు సజావుగా సాగడంతో పాటు పాదచారులు ప్రమాదాల నుంచి సురక్షితంగా రహదారి దాటే వీలు కలగనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో ట్రాఫిక్ రద్దీ సుమారు 30 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టును ఎస్సీఎస్సీ సహకారంతో, వివిధ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టనున్నారు. తొలి దశలో సుమారు 500మీటర్ల పొడవు గల స్కైవాక్‌ను నిర్మించనున్నారు. అలాగే, టీ హబ్ నుంచి మైండ్ స్పేస్ సీగేట్ వరకు సుమారు 400మీటర్ల పొడవైన అండర్‌పాస్ సొరంగం(టన్నెల్) నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ ద్వారా తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి ప్రభుత్వానికి ఈ ప్రతిపాదనలు పంపనున్నారు. భవిష్యత్తులో ఈ స్కైవాక్‌ను ఇతర ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఈ పనుల పురోగతిని జీహెచ్ఎంసీ, టీజీఐఐసీ, ఐఏఎల్ఏ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాల ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షించనున్నారు. కార్యక్రమంలో సీపీ వెంట కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్ కుమార్, మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీ సాయి కుమార్, ట్రాఫిక్ అదనపు డీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్, ఎస్సీఎస్సీ సీఈవో నావెద్‌తో పాటు రహేజా మైండ్ స్పేస్, సత్వ, దివ్యశ్రీ, ఫీనిక్స్ గ్రూప్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# మోటకొండూరులో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ముద్ర, శేరిలింగంపల్లి :**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహభరితంగా జరిగింది. పదవ తరగతి వరకు ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ వృత్తులు, హోదాల్లో స్థిరపడినప్పటికీ, తమ విద్యాభ్యాసానికి పునాది వేసిన పాఠశాలపై ఉన్న అనుబంధంతో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. విద్యార్థి దశలో గురువులతో ఏర్పడిన అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలు, అనుభూతులను ఒకరికొకరు పంచుకున్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు, ప్రస్తుత విద్యార్థుల క్రీడా అవసరాల కోసం రూ.10వేల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు కొంతం అంజిరెడ్డి, పైళ్ల కృష్ణారెడ్డి, బండ్రు రాజమల్లయ్య, అనంతుల బుచ్చిరెడ్డి, భాస్కరరావు, మధురవాణి పాల్గొన్నారు. సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews


తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు

అమరావతి (ఆంధ్రప్రదేశ్): కృష్ణా నది తీరాన ఉన్న ఈ నగరం గొప్ప బౌద్ధ చరిత్ర కలిగిన ఆధ్యాత్మిక కేంద్రం. ఇక్కడి ధ్యాన బుద్ధుని విగ్రహం అమరేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందినవి.



# ఫామ్ తేల్చేసింది.. సంజుకు దూరం, ఇషాన్‌కు ప్రపంచకప్ ఛాన్స్!





**ముద్ర, స్పోర్ట్స్**

సంజు శాంసన్‌కు భారత జట్టులో చోటు దక్కలేదంటే చాలు సోషల్ మీడియాలో పెద్ద చర్చే మొదలవుతుంది. ప్రతిభ ఉన్న ఆటగాడిని ఎందుకు పక్కన పెడుతున్నారు అంటూ అతడి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు. గతంలోనూ ఇలాంటి పరిస్థితులు ఎన్నోసార్లు చూశాం. కానీ న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ ముగిసిన తర్వాత మాత్రం సంజు ఫ్యాన్స్ నుంచి ఎలాంటి హడావుడి కనిపించలేదు. కారణం స్పష్టమే.. అతడి నిరాశాజనక ప్రదర్శనే.

కివీస్‌తో జరిగిన ఐదు టీ20ల్లో సంజు స్కోర్లు 10, 6, 0, 24, 6. మొత్తం సిరీస్‌లో కేవలం 46 పరుగులు మాత్రమే చేశాడు. సగటు 9.20కి పడిపోవడం అతడి వైఫల్యాన్ని చెప్పకనే చెబుతోంది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన సంజు ఆశించిన స్థాయిలో ఆడలేకపోయాడు. బ్యాటింగ్ ఆర్డర్లో దిగువన వచ్చే రింకు సింగ్ కూడా అతడికంటే మెరుగైన ప్రదర్శన చేయడం సంజు పరిస్థితిని మరింత క్లిష్టం చేసింది. దీంతో ప్రపంచకప్ తుది జట్టులో అతడికి అవకాశం దక్కడం కష్టంగా మారింది.

ఇదే సమయంలో మరో వికెట్‌కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తన అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకున్నాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన ఇషాన్ 53.75 సగటుతో 215 పరుగులు సాధించాడు. రెండో టీ20లో 32 బంతుల్లో 76 పరుగులతో మెరిపించగా, చివరి మ్యాచ్‌లో 43 బంతుల్లో సెంచరీతో సెలెక్టర్ల దృష్టిని పూర్తిగా ఆకర్షించాడు.

గత రెండు సంవత్సరాలుగా జట్టుకు దూరంగా ఉన్న ఇషాన్ ముస్తాక్ అలీ ట్రోఫీలో నిలకడగా రాణించి మళ్లీ జట్టులోకి వచ్చాడు. గిల్ వైఫల్యం, తిలక్ వర్మ గాయంతో సిరీస్‌కు దూరం కావడం కలిసి రావడంతో ఇషాన్‌కు తుది జట్టులో చోటు దక్కింది. ఇప్పుడు అతడి ఫామ్‌ను చూసిన తర్వాత ప్రపంచకప్ నుంచి తప్పించే సాహసం ఎవరూ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

తిలక్ వర్మ కూడా కోలుకుని టోర్నీకి అందుబాటులోకి వస్తుండటంతో మిడిలార్డర్‌లో అతడికి చోటు ఖాయంగా కనిపిస్తోంది. ఫామ్ లేని సంజు స్థానంలో ఇషాన్ ఓపెనర్‌గా కొనసాగడం దాదాపు ఖరారైనట్టే. లెఫ్ట్-రైట్ కాంబినేషన్ కంటే ప్రస్తుత ఫామ్‌కే ప్రాధాన్యం ఇస్తే, ప్రపంచకప్‌లో టీమిండియా ఓపెనింగ్ జోడీగా ఇషాన్-అభిషేక్ రంగంలోకి దిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## టీ20 ప్రపంచకప్‌కు ముందు టీమిండియా
# వార్మప్ షెడ్యూల్ ఖరారు

**ముద్ర, స్పోర్ట్స్**

టీ20 ప్రపంచకప్-2026 టోర్నమెంట్ ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానుంది. దీనికి ముందు మొత్తం 16 వార్మప్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు ఐసీసీ వెల్లడించింది. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టు ఫిబ్రవరి 4న దక్షిణాఫ్రికాతో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. అలాగే ఫిబ్రవరి 2న యూఎస్‌ఏతో ఇండియా 'ఏ' జట్టు తలపడనుంది. ఈ రెండు మ్యాచ్‌లు ముంబయి డీవై పాటిల్ స్టేడియంలో జరగనున్నాయి.

ఫిబ్రవరి 6న నమీబియాతో ఇండియా 'ఏ' జట్టు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పోటీపడనుంది. భారత్-దక్షిణాఫ్రికా మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. మిగతా వార్మప్ మ్యాచ్‌లు జియో హాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంటాయి.

శస్త్రచికిత్స అనంతరం కోలుకున్న తిలక్ వర్మను మ్యాచ్ ప్రాక్టీస్ కోసం ఇండియా 'ఏ' జట్టులోకి తీసుకున్నారు. అతడు ఇప్పటికే టీ20 ప్రపంచకప్ జట్టుకు ఎంపికైన విషయం తెలిసిందే. వార్మప్ మ్యాచ్‌ల కోసం ఎంపికైన ఇండియా 'ఏ' జట్టుకు ఆయుష్ బదోని కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, రియాన్ పరాగ్, రవి బిష్ణోయ్, ఖలీల్ అహ్మద్, మయాంక్ యాదవ్ వంటి యువ ఆటగాళ్లకు అవకాశం లభించింది.









## భారత్ మ్యాచ్ బహిష్కరణపై
# పాక్‌కు శిక్షలు తప్పవా?

- **ఐసీసీ సస్పెన్షన్‌పై ఊహాగానాలు**

**ముద్ర, స్పోర్ట్స్**

టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో జరిగే మ్యాచ్‌ను ఆడబోమన్న పాకిస్థాన్ ప్రకటన తీవ్ర దుమారం రేపుతోంది. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 15న శ్రీలంకలోని ప్రేమదాస స్టేడియంలో భారత్-పాకిస్థాన్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే భారత్‌తో మ్యాచ్‌లో పాల్గొనబోమని పాకిస్థాన్ ప్రభుత్వం సోషల్ మీడియాలో పేర్కొనడంతో వివాదం ముదిరింది.

ఈ పరిణామాల నేపథ్యంలో ఐసీసీ బోర్డు సమావేశం మరో రెండు మూడు రోజుల్లో జరిగే అవకాశముందని సమాచారం. ఆ సమావేశంలో పాకిస్థాన్ వ్యవహారంపై చర్చించి కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైతే పాకిస్థాన్‌ను అంతర్జాతీయ క్రికెట్ నుంచి సస్పెండ్ చేసే అంశం కూడా పరిశీలనలోకి రావచ్చన్న ప్రచారం సాగుతోంది.

**పరువు తప్పించుకోవడానికే బహిష్కరణ: టీఎంసీ ఎంపీ**

ఈ అంశంపై టీఎంసీ ఎంపీ కీర్తి ఆజాద్ స్పందిస్తూ, భారత్‌పై గెలవలేమన్న భయంతోనే పాకిస్థాన్ ఈ నిర్ణయం తీసుకుందని వ్యాఖ్యానించారు. పరాజయాన్ని తప్పించుకునేందుకే బహిష్కరణ నాటకం మొదలుపెట్టారని ఆయన విమర్శించారు.

**ఐసీసీ అభిప్రాయానికి బీసీసీఐ మద్దతు**

క్రీడాస్ఫూర్తి విషయంలో ఐసీసీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నామని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా తెలిపారు. ఐసీసీతో చర్చలు పూర్తయ్యే వరకు ఈ అంశంపై బీసీసీఐ ఎలాంటి వ్యాఖ్యలు చేయదని స్పష్టం చేశారు.

**వరల్డ్‌కప్‌పైనే మా దృష్టి: మిచ్ మార్ష్**

ఈ వివాదంపై ఆస్ట్రేలియా కెప్టెన్ మిచ్ మార్ష్ స్పందించేందుకు నిరాకరించారు. పాకిస్థాన్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ, తమ దృష్టంతా వరల్డ్‌కప్ విజయం పైనే ఉందని చెప్పారు. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ బహిష్కరణపై, అలాగే బంగ్లాదేశ్ భద్రత అంశంపై అడిగిన ప్రశ్నలకు కూడా అదే సమాధానాన్ని పునరావృతం చేశారు. పాకిస్థాన్ తాజా నిర్ణయం ఐసీసీ ఎలాంటి మలుపు తీసుకుంటుందన్నది ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తోంది.

## భారత్–పాక్ మ్యాచ్ రద్దయితే
# ప్రపంచకప్‌కు భారీ దెబ్బ

- **రూ.4,500 కోట్ల ఆదాయానికి గండి**

**ముద్ర, స్పోర్ట్స్**

టీ20 ప్రపంచకప్‌లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్ కేవలం గ్రూప్ పోరు మాత్రమే కాదు. టోర్నమెంట్ మొత్తం ఆర్థిక వ్యవస్థను నడిపించే కీలక మ్యాచ్‌గా ఇది మారింది. ఈ మ్యాచ్ జరగకపోతే ఐసీసీతో పాటు సభ్య దేశాలకు భారీ నష్టం తప్పదన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రసార హక్కులు, స్పాన్సర్‌షిప్‌లు, ప్రకటనలు, టికెటింగ్, హాస్పిటాలిటీ ఆదాయాన్ని కలిపితే భారత్-పాక్ ఒక్క మ్యాచ్ విలువ సుమారు 500 మిలియన్ డాలర్లు, అంటే దాదాపు రూ.4,500 కోట్లు. మ్యాచ్ సమయంలో 10 సెకన్ల ప్రకటనకు రూ.25 నుంచి రూ.40 లక్షల వరకు ధర పలకడం సాధారణమే.

మ్యాచ్ రద్దయితే ముందుగా దెబ్బ తగిలేది బ్రాడ్‌కాస్టర్లకే. ఒక్క మ్యాచ్‌తోనే సుమారు రూ.300 కోట్ల ప్రకటనల ఆదాయం కోల్పోయే పరిస్థితి ఉంటుంది. దీని ప్రభావం ఐసీసీ ఆదాయంపై పడితే, సభ్య దేశాలకు పంపే నిధుల్లో కోత తప్పదు. ఫలితంగా చిన్న దేశాల క్రికెట్ బోర్డులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. అంచనాల ప్రకారం, భారత్, పాకిస్థాన్ బోర్డులకు చెరో రూ.200 కోట్ల వరకు నష్టం వాటిల్లవచ్చు.పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఐసీసీ ఆదాయంలో సుమారు 5.75 శాతం వాటా పొందుతోంది. ఐసీసీ నిబంధనలకు విరుద్ధంగా స్వచ్ఛందంగా మ్యాచ్‌కు దూరమైతే బీమా రక్షణ ఉండదు. చెల్లింపుల నిలుపుదల, జరిమానాలు, న్యాయపోరాటాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.ఆర్థిక నష్టాలకన్నా ప్రతిష్ఠకు కలిగే భంగమే పెద్ద ప్రమాదమని విశ్లేషకులు అంటున్నారు. భారత్-పాక్ మ్యాచ్ లేకపోతే ప్రపంచకప్ మాత్రమే కాదు, మొత్తం ప్రపంచ క్రికెట్ ఆర్థిక వ్యవస్థే కుదేలయ్యే అవకాశముందని వారు హెచ్చరిస్తున్నారు.







# వైవాహిక బంధంపై మేరీకోమ్ స్పష్టత

- **వ్యక్తిగత వ్యాఖ్యలను వక్రీకరించారని ఆవేదన**

**ముద్ర, స్పోర్ట్స్**



భారత బాక్సింగ్‌లో లెజెండ్‌గా గుర్తింపు పొందిన మేరీకోమ్ తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తన వైవాహిక బంధం గురించి స్పష్టత ఇస్తూ, భర్త ఆర్థికంగా మోసం చేయడంతోనే తమ మధ్య దూరం ఏర్పడిందని ఆమె తెలిపారు. చాలా ఏళ్ల పాటు బంధం సజావుగా సాగిందని, అయితే పరిస్థితులు మారడంతో సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు.

గతంలో తాను చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని ఆవేదన వ్యక్తం చేసిన మేరీకోమ్, ఈ కారణంగా ఎవరైనా బాధపడ్డుంటే క్షమించాలని ఇన్‌స్టాగ్రామ్‌లో తెలిపారు. తన మాటలు మాజీ భర్తను ఉద్దేశించినవే తప్ప, ఇతరులను కించపరచే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులను అవమానించారన్న ఆరోపణలను ఆమె ఖండించారు. ఫుట్‌బాల్ అంటే తనకు అభిమానమని, సునీల్ ఛెత్రి, బైచుంగ్ భూటియా వంటి ఆటగాళ్లు కష్టపడి ఎదిగారని పేర్కొన్నారు. తన మాజీ భర్త ఫుట్‌బాల్ కెరీర్‌ను తన కోసం త్యాగం చేశాడన్న వాదనను కూడా ఆమె తోసిపుచ్చారు. షిల్లాంగ్‌లో ఫుట్‌బాల్ ఆడటం మానేసిన తర్వాతే అతను ఢిల్లీలో తనను కలిశాడని వివరించారు.

తన వ్యాఖ్యలను సిద్ధాంతంగా చూడవద్దని, అవి పూర్తిగా వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన భావోద్వేగ క్షణంలో వచ్చిన మాటలేనని మేరీకోమ్ విజ్ఞప్తి చేశారు.

# టీ20 ప్రపంచ కప్‌కు ముందు ఆసీస్‌కు వరుస షాక్‌లు

- **కమిన్స్ తర్వాత హేజల్‌వుడ్ కూడా తొలి మ్యాచ్‌లకు దూరం**

**ముద్ర, స్పోర్ట్స్**

టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభానికి ముందే ఆస్ట్రేలియా జట్టును సమస్యలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే కెప్టెన్ ప్యాట్ కమిన్స్ టోర్నమెంట్‌కు దూరమైన సంగతి తెలిసిందే. తాజాగా మరో కీలక బౌలర్ జోష్ హేజల్‌వుడ్ కూడా ప్రారంభ దశ మ్యాచ్‌ల్లో ఆడే అవకాశాలు లేవన్న సమాచారం వెలుగులోకి వచ్చింది.

వ్యక్తిగత కారణాల నేపథ్యంలో హేజల్‌వుడ్ టోర్నమెంట్ తొలి భాగానికి అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. దీంతో గ్రూప్ స్టేజ్‌లో ఆస్ట్రేలియా బౌలింగ్ విభాగం బలహీనపడే పరిస్థితి ఏర్పడింది. ఈ వార్తతో ఆసీస్ అభిమానుల్లో ఆందోళన నెలకొంది.

ఇదిలా ఉండగా, టీ20 ప్రపంచ కప్ కోసం ఇప్పటికే ఆస్ట్రేలియా జట్టును ప్రకటించారు. జట్టు ఇవాళ లేదా రేపు కొలంబోకు చేరుకునే అవకాశముంది. అయితే కీలక ఆటగాళ్ల గైర్హాజరు జట్టు సమతుల్యతపై ప్రభావం చూపేలా కనిపిస్తోంది. ఇటీవల మిచెల్ స్టార్క్ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలకగా, పాకిస్తాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లోనూ ఆస్ట్రేలియా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. వరుస పరిణామాలతో టోర్నమెంట్‌కు ముందు ఆసీస్ కష్టాల్లో పడినట్టుగా క్రీడా వర్గాల్లో చర్చ సాగుతోంది.



# పీసీబీ ప్రకటనపై ఐసీసీ సీరియస్?

- **భారత్ మ్యాచ్ బహిష్కరణపై అధికారిక సమాచారం లేదన్న అంతర్జాతీయ మండలి**

**ముద్ర, స్పోర్ట్స్**

టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో జరిగే మ్యాచ్‌ను ఆడబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేసిన ప్రకటనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి స్పందించింది. ఈ అంశంపై పీసీబీ నుంచి ఇప్పటివరకు తమకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని ఐసీసీ స్పష్టం చేసింది. ఇటువంటి ప్రకటనలు అంతర్జాతీయ క్రికెట్ సమగ్రతపై ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది.

క్రీడలను రాజకీయాలకు దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందని ఐసీసీ గుర్తు చేసింది. జాతీయ విధానాలను గౌరవిస్తామని చెప్పినా, టోర్నమెంట్ గౌరవం దెబ్బతినకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని పీసీబీ తీసుకోవాలని సూచించింది. కావాలనే మ్యాచ్‌ను వదిలివేయడం క్రికెట్‌కు మంచిది కాదని, దీర్ఘకాలంలో పాకిస్థాన్ క్రికెట్‌కే నష్టం కలిగించే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. ఈ టోర్నీలో పాకిస్థాన్ గ్రూప్‌ఏలో ఉంది. భారత్, నమీబియా, నెదర్లాండ్స్, అమెరికా జట్లతో కలిసి పోటీపడనుంది. పాకిస్థాన్ ఆడే అన్ని మ్యాచ్‌లు శ్రీలంకలో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 7న నెదర్లాండ్స్‌తో తొలి మ్యాచ్, ఫిబ్రవరి 10న అమెరికాతో, ఫిబ్రవరి 18న నమీబియాతో పాకిస్థాన్ తలపడనుంది.

International Cricket Council

PCB
Pakistan Cricket Board

# పాకిస్తాన్ నిర్ణయాన్ని ఐసీసీ చూసుకుంటుంది : రాజీవ్ శుక్లా

**ముద్ర, స్పోర్ట్స్**



టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్‌లో పాల్గొనడంపై పాకిస్తాన్ నుంచి మరో కీలక ప్రకటన వచ్చింది. భారత్‌తో జరిగే మ్యాచ్‌ను మినహాయించి మిగిలిన అన్ని మ్యాచ్‌లు ఆడతామని పాకిస్తాన్ స్పష్టం చేసింది. ఈ ప్రకటనతో టోర్నమెంట్‌పై చర్చలు మళ్లీ వేడెక్కాయి.

ఈ నేపథ్యంలో బీసీసీఐ అధికారి రాజీవ్ శుక్లా స్పందించారు. వివాదాలకు తావివ్వకుండా, ఈ అంశాన్ని ఐసీసీ పరిధిలోనే చూడాల్సిన విషయమని ఆయన స్పష్టం చేశారు. పాకిస్తాన్ తీసుకున్న నిర్ణయంపై ఐసీసీ ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందని తెలిపారు.

క్రీడలను రాజకీయాల నుంచి వేరు పెట్టాలన్నదే ఐసీసీ విధానమని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో బీసీసీఐ కూడా ముందుకెళ్తుందని చెప్పారు. ఈ అంశంపై బీసీసీఐ ప్రత్యేకంగా ప్రకటన చేయదలుచుకోలేదని, అవసరమైతే ఐసీసీతోనే చర్చలు జరుపుతామని వెల్లడించారు. ఇదిలా ఉండగా, టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్-పాకిస్తాన్ మధ్య మ్యాచ్ ఈ నెల 15న జరగాల్సి ఉంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో ఆ మ్యాచ్ జరుగుతుందా లేదా అన్న అనిశ్చితి నెలకొంది. ఈ విషయంలో తుది నిర్ణయం ఐసీసీ తీసుకునే అవకాశం ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
03.02.2026 మంగళవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**తెలుగు రాష్ట్రాల్లో సందర్శనీయ స్థలాలు**

యాదాద్రి (తెలంగాణ): అత్యంత వైభవంగా పునర్నిర్మించబడిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం ఇది. కృష్ణశిలలతో నిర్మించిన ఈ ఆలయం అద్భుతమైన శిల్పకళతో భక్తులను ఆకట్టుకుంటోంది.



# ఫిబ్రవరి 26నే ముహూర్తమా?

- **విజయ్–రష్మిక పెళ్లి వార్తలు మళ్లీ హాట్ టాపిక్**



టాలీవుడ్‌లో ఎప్పటికప్పుడు చర్చలో ఉండే జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా ఫిబ్రవరి ప్రారంభంలోనే వివాహం జరుగుతుందన్న ప్రచారాన్ని రష్మిక ఖండించినా, కొత్త కథనాలు మాత్రం ఆగడం లేదు.
తాజాగా వీరి పెళ్లి ఫిబ్రవరి 26న జరగవచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రహస్యంగా నిశ్చితార్థం పూర్తయ్యిందన్న ఊహాగానాలు కూడా నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇద్దరి చేతులపై కనిపించిన డైమండ్ రింగుల ఫొటోలు ఈ ప్రచారానికి మరింత ఊతమిచ్చాయి.ఇదిలా ఉండగా, రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్నాయన్న వీడియోలు సోషల్ మీడియాలో దర్శనమివ్వడంతో ఈ పుకార్లు మరింత బలపడుతున్నాయి. అయితే ఈ అంశంపై విజయ్ గానీ, రష్మిక గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.
వివాహ వార్తలు ఎంత హోరెత్తినా, నిజానిజాలు తెలియాలంటే ఈ జంట నుంచి స్పష్టత రావాల్సిందేనని అభిమానులు భావిస్తున్నారు. అప్పటివరకు ఈ పెళ్లి గాసిప్‌లకు ఫుల్‌స్టాప్ పడేలా లేదు.

## రామ్ చరణ్ దంపతులకు శుభాకాంక్షల వెల్లువ



రామ్‌చరణ్, ఉపాసన దంపతులకు అల్లు అర్జున్ శుభాకాంక్షలు తెలిపారు. ఆనందంతో నిండిన కుటుంబాన్ని చూడటం సంతోషంగా ఉందని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. మరోసారి తల్లిదండ్రులైన చరణ్, ఉపాసనకు అభినందనలు తెలియజేస్తూ, కుటుంబ సభ్యుల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం హృద్యంగా ఉందని వ్యాఖ్యానించారు. చిన్నారుల రాకతో ఇంటి వాతావరణం మరింత ఉత్సాహంగా మారిందని తెలిపారు.
ఇదే సమయంలో నిర్మాత అల్లు అరవింద్, కొణిదెల కుటుంబానికి చెందిన నటులు, పలువురు సినీ ప్రముఖులు కూడా చరణ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 31న ఉపాసన కవలలకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. అదే రోజు రాత్రి చిరంజీవి ఈ శుభవార్తను అభిమానులతో పంచుకున్నారు. ఉపాసన, చిన్నారులు ఆరోగ్యంగా ఉన్నారని వెల్లడించారు. కవలల రాకతో కుటుంబ సభ్యులతో పాటు చిరు, చరణ్ అభిమానులు ఆనందోత్సవాలు చేసుకున్నారు.

# డిజిటల్‌లోనూ 'దురంధర్' దూకుడు..

- **తెలుగులో అదిరిపోయిన స్పందన**



కేవలం హిందీలో విడుదలై బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'దురంధర్' ఇప్పుడు డిజిటల్ వేదికపై కూడా సంచలనం సృష్టిస్తోంది. థియేటర్లలో వందల కోట్ల వసూళ్లు సాధించిన ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చి అంచనాలకు మించి స్పందన తెచ్చుకుంటోంది. డిజిటల్ క్వాలిటీపై కొంత విమర్శలు ఉన్నా.. వ్యూస్ మాత్రం భారీగా నమోదవుతున్నాయి.
హిందీతో పాటు ఇతర భాషల్లోనూ స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ చిత్రానికి తెలుగులో ప్రత్యేకమైన ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు డబ్బింగ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఒరిజినల్ ఫీల్ తగ్గకుండా డైలాగులు రాయడం, పాత్రలకు సరిపోయే వాయిస్‌లు ఎంపిక చేయడం ప్రేక్షకులను ఆకట్టుకుంది.
పాన్ ఇండియా సినిమా కాకపోయినా.. తెలుగులో ఇంత సహజంగా అనిపించడం అరుదని అభిమానులు అంటున్నారు. ఈ స్పందన దృష్ట్యా 'దురంధర్-2'కు తెలుగులో మరింత క్రేజ్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి

# ప్రేమికుల రోజుకు 'కపుల్ ఫ్రెండ్లీ'

- **లివింగ్ టుగెదర్ నేపథ్యంతో వినోదాత్మక కథ**



ప్రేమికుల రోజు సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రావడానికి 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా సిద్ధమైంది. సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. ప్రచారంలో భాగంగా సోమవారం ట్రైలర్ విడుదల చేశారు.
ట్రైలర్‌ను పరిశీలిస్తే, లివింగ్ టుగెదర్ నేపథ్యంలో సాగే కథగా ఈ చిత్రం తెరకెక్కినట్టు స్పష్టమవుతోంది. చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో నడిచే ఈ కథలో కామెడీకి ప్రధాన ప్రాధాన్యం ఇచ్చారు. సంబంధాలు, భావోద్వేగాల చుట్టూ తిరిగే సన్నివేశాలతో పాటు సరదా డైలాగులు ఆకట్టుకుంటున్నాయి.
''ఎంతమంది అమ్మాయిల జీవితాలను నాశనం చేశావో'' అన్న ప్రశ్నకు, ''నేను నా జీవితం తప్ప మరెవరి జీవితాన్నీ నాశనం చేయలేదండీ'' అంటూ హీరో ఇచ్చే సమాధానం నవ్వులు తెప్పిస్తోంది. ప్రేమ, సహజీవనం, హాస్యం మేళవింపుగా రూపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 14న ప్రేక్షకులను అలరించనుంది.

# సంక్రాంతి రేసులో ఆశలు వృథా..

- **'పరాశక్తి' బాక్సాఫీస్ డిజాస్టర్**

సంక్రాంతి పండుగ తెలుగు ప్రేక్షకులతో పాటు తమిళ సినీ అభిమానులకు కూడా ప్రత్యేకమే. ఈ సీజన్‌లో భారీ చిత్రాలు బరిలోకి దిగుతాయి. ఈ ఏడాది విజయ్ సినిమా 'జననాయకన్' తమిళ సంక్రాంతిని షేక్ చేస్తుందని భావించారు. కానీ ఆ చిత్రం పోటీ నుంచి తప్పుకోవడంతో అందరి దృష్టి శివకార్తికేయన్ నటించిన 'పరాశక్తి'పై నిలిచింది.
సుధ కొంగర దర్శకత్వం, జయం రవి ప్రతినాయక పాత్ర, శ్రీలీల కథానాయికగా నటించడం వంటి అంశాలు సినిమాపై అంచనాలు పెంచాయి. వింటేజ్ టచ్‌తో రూపొందిన కథ కూడా ఆసక్తిని రేకెత్తించింది. అయితే విడుదల తర్వాత సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది.
క్రిటిక్స్ మాత్రం సినిమాకు మంచి రేటింగ్స్ ఇచ్చారు. సంక్రాంతికి పెద్ద సినిమాల కొరత ఉండటంతో థియేటర్లు కూడా ఎక్కువగా ఈ సినిమాకే దక్కాయి. తమిళ సంస్కృతి, భాష, ఆత్మాభిమానాన్ని ప్రధానంగా చూపించిన చిత్రం కావడంతో ఫ్లాప్‌గా అంగీకరించేందుకు స్థానికంగా ఆసక్తి చూపలేదు. పీఆర్, మీడియా హైప్‌తో కలెక్షన్లు ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం సాగింది. అయితే మూడో వారం నుంచే వసూళ్లు పూర్తిగా పడిపోయాయి. మరో చిత్రమైన 'తలైవర్ తంబి తలైమయిల్' స్పష్టమైన ఆధిపత్యం చూపింది. థియేట్రికల్ రన్ ముగిసిన తర్వాత లెక్కలు బయటకు రాగా, 'పరాశక్తి' భారీ నష్టాల సినిమా అని తేలింది. సుమారు రూ.150 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.85 కోట్ల గ్రాస్ మాత్రమే సాధించింది. షేర్ రూ.50 కోట్లలోపే ఉండటంతో, నాన్ థియేట్రికల్ ఆదాయం కలిపినా నిర్మాతలకు నష్టమే మిగిలింది. బాక్సాఫీస్ లెక్కల ప్రకారం ఇది స్పష్టమైన డిజాస్టర్ మిగిలింది.




# 'దూకుడే కారణమంటూ వదిలేశాడు'

**తన బ్రేకప్ గురించి చెప్పిన మృణాల్ ఠాకూర్**



నటి మృణాల్ ఠాకూర్ మరోసారి తన వ్యక్తిగత జీవిత వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. ప్రేమ, పెళ్లి అంశాలపై జరుగుతున్న చర్చల మధ్య తాజాగా ఆమె మాజీ ప్రేమికుడిపై చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. తనతో ఉండలేనంటూ అతడు బ్రేకప్ చెప్పినప్పుడు తానేమీ బాధపడలేదని మృణాల్ స్పష్టం చేశారు.
'దో దీవానే శహర్ మే' చిత్రం ఫిబ్రవరి 20న విడుదల కానున్న నేపథ్యంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు. తనకు దూకుడు ఎక్కువని, నటిగా కొనసాగడమూ తన మాజీకి ఇష్టం లేదని చెప్పారు. అలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తితో జీవితం కొనసాగించడం కష్టమని, భవిష్యత్తులో పిల్లలపై కూడా దాని ప్రభావం పడుతుందని భావించి విడిపోయామని మృణాల్ తెలిపారు.
ఇటీవల తన డేటింగ్‌పై వస్తున్న రూమర్స్‌పైనా ఆమె స్పందించారు. ధనుష్, శ్రేయస్ అయ్యర్‌లతో రిలేషన్‌లో ఉన్నట్టు వచ్చిన ప్రచారాలను ఖండిస్తూ, ఇవన్నీ ఊహాగానాలే అని, ఫ్రీ పీఆర్ స్టంట్స్‌లా నవ్వుతూ వదిలేస్తానని పేర్కొన్నారు.

# అందాలతో కుర్రాళ్లను గిలిగింతలు పెడతున్న దివ్య



దివ్య భారతి తమిళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంటోంది. 'బ్యాచిలర్' సినిమాతో వచ్చిన గుర్తింపు ఆమె కెరీర్‌కు బలమైన పునాది వేసింది. ఆ తర్వాత ఎంచుకుంటున్న పాత్రల్లో భావోద్వేగాల సహజత్వం, ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపిస్తున్నాయి. తెరపై సున్నితత్వాన్ని, ధైర్యాన్ని సమతుల్యంగా చూపగలగడం ఆమెను కొత్త తరం నటీమణుల్లో ప్రత్యేకంగా నిలబెడుతోంది.
ఇటీవల విడుదలైన *'మదిల్ మేల్ కాదల్'లో ఆమె ప్రదర్శన ప్రశంసలు అందుకుంది. రొమాంటిక్ డ్రామాలో సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. అలాగే 2024లో వచ్చిన *'మహారాజా'**లో భాగస్వామ్యమవడం ద్వారా కంటెంట్ ప్రాధాన్యమున్న సినిమాల్లోనూ తన సత్తా చాటింది.
విభిన్న జానర్లలో కొత్త ప్రాజెక్ట్‌లతో ముందుకెళ్తున్న దివ్య భారతి, ఒక్కసారిగా స్టార్‌డమ్ కోసం కాకుండా.. దీర్ఘకాలిక కెరీర్ లక్ష్యంగా అడుగులు వేస్తోందన్న భావన కలుగుతోంది.

## త్వరలో వెండితెర మీదకు మీర్జాపూర్

యువతలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న వెబ్ సిరీస్ 'మీర్జాపూర్' ఇప్పుడు సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. 'మీర్జాపూర్ ది ఫిల్మ్' పేరుతో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం తాజాగా కీలక అప్‌డేట్ ఇచ్చింది. సినిమా షూటింగ్ పూర్తయినట్లు వెల్లడిస్తూ, త్వరలోనే విడుదల తేదీని ప్రకటించే అవకాశముందని తెలిపింది.గత ఏడాది ఆగస్టులో ప్రారంభమైన రెగ్యులర్ షూటింగ్‌ను ఆరు నెలల్లోనే ముగించారు. ఈ సినిమా సిరీస్‌కు ప్రీక్వెల్‌గా ఉండనుందని ఇప్పటికే మేకర్స్ స్పష్టం చేశారు. సిరీస్‌లోని మూడు సీజన్లలో మరణించిన పాత్రలన్నీ ఈ సినిమాలో కనిపించనున్నాయన్న విషయం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.
యాక్షన్, క్రైమ్, థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన 'మీర్జాపూర్'కు గుర్మీత్‌సింగ్ దర్శకత్వం వహించారు. 2018లో మొదటి సీజన్ విడుదలై భారీ ఆదరణ పొందగా, ఆ తర్వాత వచ్చిన రెండో, మూడో సీజన్లు కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందు శర్మ, శ్వేతా త్రిపాఠి తదితర నటులు ఈ సిరీస్‌కు ప్రధాన బలంగా నిలిచారు.




Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.
Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com